



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 283 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు మంగళవారం 16 జూన్ 2026 వెల : 1/-రూ॥

VOLUME :1 ISSUE :283 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE TUE 16 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ.. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు

- సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ కీలక సమావేశం
- అమరావతి సహా అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం కోరిన ముఖ్యమంత్రి
- ఏపీ నుంచి ఆక్వా, ఉద్యాన ఉత్పత్తుల దిగుమతికి విజ్ఞప్తి
- సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎయిర్ కనెక్టివిటీపై ఫలవంతమైన చర్చలు

- మిగతా 2లో




## సతీసమేతంగా రుద్రాభిషేకంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...

- రాష్ట్ర శ్రేయస్సు కోసం లోకేశ్, బ్రాహ్మణి దంపతుల రుద్రాభిషేకం
- హైదరాబాద్ నివాసంలో మంత్రి లోకేశ్ దంపతుల ప్రత్యేక పూజలు
- ఏపీ ప్రజల సంక్షేమం కోరుతూ మహాశివుడికి లోకేశ్ పూజలు
- లోకేశ్, బ్రాహ్మణి ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

- మిగతా 2లో



## గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

పెన్ పవర్ డెస్క్: గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండా లని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైకాపా నిత్యం కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేస్తోందంటూ సీఎం చంద్రబాబు నిరంతం చెబుతున్న మాట నూటికి నూరు శాతం నిజమని చెప్పారు. మెగా డీఎస్సీ నిర్వహణపై గొడ్డలి పార్టీ చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారంతో ఆ విషయం మరోసారి స్పష్టమవుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కర్నూలులో నిర్వహించిన విజయోత్సవ సభలో మంత్రి మాట్లాడారు. "వైకాపా నేతలు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు

- మిగతా 2లో






## తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..

### ఢిల్లీలో పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు

- తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యమెందుకని ప్రశ్న
- రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచిందన్న పవన్ కల్యాణ్
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం జనసేన పనిచేస్తుందన్న పవన్

- మిగతా 2లో




## 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

### బ్రిటన్ ప్రభుత్వం సంచలన నిర్ణయం...

- 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం విధించిన యూకే
- పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రతే లక్ష్యమన్న ప్రధాని కీర్ స్టార్మర్
- టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ సహా ప్రధాన ప్లాట్‌ఫామ్‌లకు వర్తించనున్న నిబంధనలు
- నిర్ణయాన్ని స్వాగతించిన స్వచ్ఛంద సంస్థలు

పెన్ పవర్ డెస్క్:బ్రిటన్‌లో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్ మీడియాను ఉపయోగించకుండా నిషేధించాలని అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ ప్రపంచంలో పిల్లల మానసిక ఆరోగ్యాన్ని, భద్రతను కాపాడటంతో పాటు వారికి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం

- మిగతా 2లో


## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి...

- 'కాక్‌రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై జైపూర్‌లో దాడి
- నీట్ లీక్, నిరుద్యోగంపై నిరసన తెలుపుతుండగా ఘటన
- కేంద్ర మంత్రి రాజీనామా డిమాండ్‌తో ఆందోళన
- అభిజీత్‌పై మూకదాడికి సంబంధించిన వీడియోలు వైరల్
- యువతలో ఈ పార్టీకి ఆన్‌లైన్‌లో భారీ మద్దతు

- మిగతా 2లో



## బడుల్లో బ్రేక్‌ఫాస్ట్



- 1,269 పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకం స్టార్ట్
- మంత్రి పొన్నం ప్రభాకర్‌కు టిఫిన్ తినిపించిన స్టూడెంట్
- రాష్ట్రవ్యాప్తంగా స్కూళ్లు రీఓపెన్
- పూలు, చాక్లెట్లు ఇచ్చి స్వాగతం పలికిన టీచర్లు
- బ్రేక్ ఫాస్ట్ స్కీంతో 1.44 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

- మిగతా 2లో

## అమెరికా-ఇరాన్ డీల్.. స్వాగతించిన మోదీ



పెన్ పవర్ డెస్క్:అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఉద్రిక్తతలను ముగించేం దుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. "పశ్చిమాసియాలో

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## హ్యాట్రిక్ పై యోగి గురి

భారత రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఉత్తరప్రదేశ్ లో ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ రకరకాల వ్యూహాలకు పదును పెడుతోంది. గతంలో లాగా కాకుండా, ఈసారి ఎన్నికలకు ముందే యోగి ఆదిత్యనాథ్ తామే సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగుతారని పార్టీ జాతీయ నాయకత్వం అధికారికంగా ప్రకటించడం గమనార్హం. గత లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ సాధించిన విజయాలకు బ్రేక్ వేయడమే కాకుండా, విపక్షాల ఓటు బ్యాంకును ముక్కలు చేసేందుకు యోగి మార్క్ పొలిటికల్ స్కెచ్ సిద్ధమైంది. అఖిలేష్ యాదవ్ విస్తృతంగా ప్రచారంలోకి తెచ్చిన పిడిఏ ఫార్ములా పిచ్డే, దళిత్, అల్పసంఖ్యాక్ - వెనుకబడిన, దళిత, మైనారిటీల కూటమి ఫార్ములాను దెబ్బతీయడమే యోగి ప్రధాన ఎజెండా. దీనికోసం ఇటీవల యూపీ క్యాబినెట్‌ను విస్తరిస్తూ ఆరుగురు కొత్త మంత్రులతో యోగి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ విస్తరణ వెనుక పక్కా సోషల్ ఇంజనీరింగ్ దాగి ఉంది. సమాజ్ వాదీ పార్టీ బలంగా నమ్ముకునే యాదవేతర ఓబీసీ , దళిత సామాజిక వర్గాలకు మంత్రివర్గంలో పెద్దపీట వేయడం ద్వారా అఖిలేష్ యాదవ్ ఓటు బ్యాంకు పునాదులను కదిలించేలా యోగి వ్యూహాత్మక అడుగులు వేశారు. ఎస్పీ సాంప్రదాయ ఓటు బ్యాంకు అయిన యాదవేతర వెనుకబడిన కులాలను తమ వైపు తిప్పుకోవడం ద్వారా అఖిలేష్ ... ముసుగును తొలగించాలని యోగి ప్లాన్ చేస్తున్నారు. సమాజ్ వాదీ పార్టీలో యాదవుల ఆధిపత్యంపై అసంతృప్తిగా ఉన్న ఇతర ఓబీసీ ఉప-కులాలను మౌర్య, కుర్మీ, నిషాద్, రాజ్‌భర్ వంటి వర్గాలను బీజేపీ తన వైపు తిప్పుకుంటోంది. ఇందుకోసం చిన్న చిన్న ప్రాంతీయ పార్టీలతో పొత్తులను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా ఆయా సామాజిక వర్గాల చివరి లబ్ధిదారులకు చేరేలా యోగి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కుల సమీకరణాలతో పాటు రాష్ట్రాన్ని కుదిపేసే క్రైమ్, గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని ఉక్కుపాదంతో అణిచివేయడం ద్వారా శాంతిభద్రతల అంశాన్ని మరోసారి తన ప్రధాన ఆయుధంగా మలుచుకుంటున్నారు. ఇక రాజకీయంగా విపక్షాలను డిఫెన్స్‌లో పడేసేందుకు యోగి ఆదిత్యనాథ్ మరోసారి తన పాత వైఖరిపైన 'హార్డ్ హిందుత్వ' అస్త్రాన్ని ప్రయోగించారు. ఇటీవల కుషీనగర్, గొండాలో జరిగిన బహిరంగ సభల్లో ఆయన నేరుగా సమాజ్ వాదీ పార్టీని రామ విరోధులు గా అభివర్ణించారు. కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు దశాబ్దాల పాటు అయోధ్య రామమందిర నిర్మాణాన్ని అడ్డుకున్నాయని, 500 ఏళ్ల హిందువుల నిరీక్షణకు డబుల్ ఇంజన్ సర్కార్ మాత్రమే ముగింపు పలికిందని గుర్తు చేశారు. అఖిలేష్ యాదవ్ ఇటీవల అవలంభిస్తున్న సాఫ్ట్ హిందుత్వ పొలిటిక్స్‌ను యోగి తీవ్రంగా ఎండగడుతున్నారు. అభివృద్ధి జాతీయ భద్రత అనే అంశాలను కూడా యోగి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. ఒకప్పుడు అల్లర్లు, మాఫియాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు బ్రహ్మోస్ మిసైల్ తయారీ కేంద్రాలు వస్తున్నాయని, పాకిస్థాన్‌ను సైతం గడగడలాడించే రక్షణ పరిశ్రమలను యూపీ గడ్డపై ఏర్పాటుచేస్తున్నామని ఆయన చెప్పుకొస్తున్నారు. నవ్య అయోధ్య, కాశీ విశ్వనాథ్ కారిడార్ ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించామని, గతంలో జరిగిన పరీక్షల పేపర్ లీకేజీల నిందితులను జైలుకు పంపామని వివరిస్తున్నారు. అఖిలేష్ యాదవ్ కులాల వారీగా ఓట్లను ఏకం చేసే ప్రయత్నం చేస్తుంటే.. యోగి ఆదిత్యనాథ్ మాత్రం ఆ ఓట్లను చీలుస్తూ హిందూ ఓటు బ్యాంకును ఏకం చేస్తూ, యాదవేతర వెనుకబడిన వర్గాలను అధికారంలో భాగస్వాములను చేసే దృఢమైన వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. గడిచిన రెండు ఎన్నికల కంటే కూడా 2027 లో యూపీ అసెంబ్లీలో భారీ మెజార్టీతో బీజేపీ తిరిగి పీఠాన్ని దక్కించుకుంటుందని యోగి ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రూరమైన పొలిటికల్ మైండ్ గేమ్‌లో అఖిలేష్ యాదవ్ యోగి స్పీడ్‌ను ఎంతవరకు తట్టుకుంటారనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

## సతీసమేతంగా రుద్రాభిషేకంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రహ్మణి దంపతులు సోమవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ వారు మహాశివుడికి ఈ పూజలు చేశారు. పవిత్రమైన సోమవారం సందర్భంగా, వేద పండితుల మార్గదర్శకత్వంలో ఏకాదశ మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రగతి, శ్రేయస్సు, ప్రజా సంక్షేమం కోసం పరమశివుడి ఆశీస్సులు కోరుతూ ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. రుద్రాభిషేకం అనంతరం లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ప్రత్యేక హారతి కార్యక్రమంలో పాల్గొని, వేద పండితుల నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. రాష్ట్ర ప్రజల మేలు కోరుతూ మంత్రి దంపతులు ఈ పూజలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. రుద్రాభిషేకం ఫొటోలను పంచుకున్నారు.

## గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

మేలు చేయలేదు.. డీఎస్సీలు నిర్వహించలేదు. అధికారం కోల్పోయాక మాత్రం కుట్రల మీద కుట్రలు పన్నుతున్నారు. మెగా డీఎస్సీ-2025ను అడ్డుకునేందుకు, ఆ ప్రక్రియను పురిట్లోనే చంపేయడానికి ఎన్నో కేసులు వేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్.. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తూ, మరోవైపు పెట్టుబడులు, ఉద్యోగావకాశాలను సృష్టించేలా పరిశ్రమలు తెస్తున్నారు. దీన్ని ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తూ తప్పుడు ప్రచారం చేయిస్తోంది. అత్యంత పారదర్శకంగా జరిగిన మెగా డీఎస్సీపై ఏడాది తర్వాత ఆరోపణలు గుప్పిస్తూ ఆ పార్టీ సైకోయిజాన్ని ప్రదర్శిస్తోంది. వైకాపా పాలనతో వెంటిలేటర్‌పైకి వెళ్లిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సీఎం చంద్రబాబు బాగు చేసి ఐసీయూకి తీసుకొచ్చారు. నాడు జగన్ అమ్మఒడి ఒక్క బిడ్డకే ఇస్తే.. ఎంత మంది బిడ్డలుంటే అందరికీ తల్లికి వందనం అందిస్తున్నాం" అని నిమ్మల రామానాయుడు అన్నారు.

**సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సమీక్ష**

అంతకుముందు కర్నూలు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. మొదటి ఏడాదిలోనే హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేశామని చెప్పారు. నేటికీ రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా ఉన్నాయంటే చంద్రబాబు వాటర్ మేనేజ్‌మెంట్ వల్లే సాధ్యమైందన్నారు. కర్నూలు పశ్చిమ ప్రాంతం సాగు, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చంద్రబాబు, లోకేశ్ సూచించారని చెప్పారు. కీలకమైన గుండ్రేవుల, ఆర్డీఎస్ కుడి కాలువ, గాజుల దిన్నె, వేదవతి, గురురాఘవేంద్ర ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని రామానాయుడు తెలిపారు.

## 16 ఏళ్ల లోపు వారికి 'నో సోషల్ మీడియా'

- మొదటి పేజి తరువాయి

ప్రకటించారు. డౌనింగ్ స్ట్రీట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, "మన పిల్లలను విఫలం చేస్తున్న వ్యవస్థకు స్వస్తి పలికే సమయం ఆసన్నమైంది. ఈ నిర్ణయం ద్వారా పిల్లలకు వారి బాల్యాన్ని తిరిగి అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. టెక్ దిగ్గజాల ప్రభావం నుంచి చిన్నారులను రక్షిస్తూ, వారి సురక్షితమైన వాతావరణంలో ఎదిగేందుకు ఈ నిషేధం దోహదపడుతుందని ఆయన వివరించారు.

ఇప్పటికే ఆస్ట్రేలియాలో అమలవుతున్న విధానం స్ఫూర్తితో ఈ నూతన పాలసీని తీసుకువస్తున్నారు. దీని ప్రకారం టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, స్నాప్‌చాట్, ఎక్స్ వంటి ప్రధాన ప్లాట్‌ఫామ్‌లపై 16 ఏళ్లలోపు వారికి ప్రవేశం ఉండదు. లైవ్ స్ట్రీమింగ్, అపరిచితులతో సంభాషించడం వంటి ఫీచర్లపై కూడా ఆంక్షలు అమలవుతాయి. ఈ నిర్ణయానికి ముందు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో దాదాపు 90 శాతం మంది తల్లిదండ్రులు ఈ నిషేధానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తున్నారు. చిన్నారుల రక్షణలో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని ఎన్ఎస్‌పీసీసీ వంటి స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. ఆన్‌లైన్ కంటెంట్ కారణంగా తన కుమార్తెను కోల్పోయిన ఎస్తర్ ఘే అనే తల్లి, ఈ నిషేధం ఎందరో పిల్లల ప్రాణాలను కాపాడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఈ చట్టం అమలు తీరుపై నిపుణులు కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో ఇటువంటి నిషేధం ఉన్నప్పటికీ, చాలామంది టీనేజర్లు వీపీఎన్ వంటి మార్గాల ద్వారా సోషల్ మీడియాను వినియోగిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ సవాళ్లను అంగీకరించిన ప్రధాని స్టార్మర్, సాంకేతిక అడ్డంకులను సాకుగా చూపి చర్యలు తీసుకోకుండా ఉండలేమని స్పష్టం చేశారు. కఠినమైన వయసు ధ్రువీకరణ వ్యవస్థలతో జులై నుంచి ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# బాదం పప్పు బాగోతాలు - ఎపిసోడ్ 19

# ఒక ఎస్సై బదిలీల వెనుక అసలు కథ ఏమిటి?

- వి.ఆర్‌ల నుంచి పోస్టింగ్‌ల దాకా...
- ఎక్కడికి వెళ్లినా అదే వివాదాలా..?
- పోస్టింగ్‌లు, వి.ఆర్‌లు, మామజీ ప్రభావంపై శాఖలోనే గుసగుసలు
- తొలి పోస్టింగ్ నుంచే వివాదాల వెంటాడటం
- పాలకొల్లు నుంచి పెనుమంట్ర వరకు వి.ఆర్‌ల పరంపర
- మామ జీ అండతోనే కీలక పోస్టింగ్‌లా?
- తణుకు, కొవ్వూరు, పాలకొల్లు టౌన్‌ల్లోనూ అదే కథ?
- రైడ్లలో స్వాధీనం చేసుకున్న వస్తువులపై ఆరోపణలు
- రాజకీయ ఆశ్రయం - శాఖలో చర్చనీయాంశం

**పోలీసు శాఖలో బదిలీలు, పోస్టింగ్‌లు, వి.ఆర్. (వేకెంట్ రిజర్వ్)లు సాధారణ పరిపాలనా ప్రక్రియలే. అయితే ఒక అధికారి పేరు వరుసగా ప్రతి పోస్టింగ్‌లో వివాదాలకు కేంద్రంగా మారి, అనంతరం వి.ఆర్‌కు వెళ్లి, కొంతకాలానికే మరో కీలక పోస్టింగ్‌లో ప్రత్యక్షమవుతుండటం ఇప్పుడు శాఖలోనే చర్చనీయాంశంగా మారింది. శాఖ వర్గాల్లో "బాదం పప్పు"గా పిలుచుకునే ఓ ఎస్సై కెరీర్ ప్రయాణం ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.**

**ఎడిటర్ , పెన్ పవర్ తాడేపల్లి గూడెం జూన్ 15 :** కాళ్ళ మొదటి పోస్టింగ్ వచ్చింది అక్కడ నుంచి రెండవ పోస్టింగ్ పాలకొల్లు రూరల్ ఎస్సై గా ట్రాన్స్ఫర్ అయ్యారు మన బాదం పప్పు.. అయితే అక్కడ కొన్ని లొసుగులు దొరకడం తో పాలకొల్లు రూరల్ నుంచి విఆర్ లోకి వెళ్ళాడు. విఆర్ లోకి వెళ్ళిన మూడు నెలలకే, మూడూ నాళ్ళ ముచ్చటగా ఎక్కడ పోయిందో అక్కడే వెతుక్కోమన్నట్టుగా మళ్లీ పాలకొల్లు రూరల్ కు పోస్టింగ్ తెచ్చుకున్నాడు.. జనరల్ ట్రాన్స్ఫర్ లో అక్కడ నుంచి తాడేపల్లిగూడెం రూరల్ కు ట్రాన్స్ఫర్ అయ్యాడు మళ్లీ జనరల్ ట్రాన్స్ఫర్ లో పెనుమంట్ర ట్రాన్స్ఫర్ అయ్యాడు.

అక్కడ కూడా రుచి మరిగిన కోడి మిద్దెక్కి కూసిందని.. కుక్క తోక వంకర లా మళ్లీ పెనుమంట్ర లో దొరికి వి ఆర్ లోకి వెళ్ళాడు. అనంతరం అర్థబలం ఉపయోగించి తణుకు ట్రాఫిక్ ఎస్సై గా చేసి తణుకు రూరల్ ఎస్సై గా ట్రాన్స్ఫర్ అయ్యాడు అక్కడ మళ్లీ కథ మొదటికి వచ్చి తణుకు రూరల్ నుంచి విఆర్ లోకి వెళ్లాడూ.. మమ జీ చక్కగా ప్లాన్ ఎగ్జిక్యూట్ చేసి విఆర్ నుంచి మళ్లీ కొవ్వూరు ఎస్సై గా బదిలీ చేయించుకున్నాడు.. అబ్బే అక్కడ కూడా అదే పాట .. కొవ్వూరు నుంచి కూడా వి ఆర్ కి వెళ్ళాడు .. అనతరం వి ఆర్ నుంచి మళ్లీ మామ జీ దయతో వెస్ట్ గోదావరి స్పెషల్ బ్రాంచ్ ఎస్సైగా వెళ్లాడు... ఇ సారి అంగబలం అర్థ బలం ఉపయోగించి మామ జీ పాలకొల్లు టౌన్ కు ఎస్సై గా పోస్టింగ్ వేయించాడు కథ మళ్లీ మామూలే సేమ్ టూ సేమ్ యదావిధిగా పాలకొల్లు టౌన్ నుంచి వి ఆర్ లో కి వెళ్ళాడు .. అక్కడ నుంచి ఈ సారి శాఖ లో ఓ పెద్ద తలకాయ కు పెద్ద మొత్తం లో దక్షిణం మామజీ సమర్పించాడని శాఖలోని తోటి ఉద్యోగులే గుసగుసలాడుకోవడం కొసమెరుపు..?

ఎట్టకేలకు మొత్తానికి తాడేపల్లిగూడెం టౌన్ కు పోస్టింగ్ రప్పించుకున్నాడని ఇప్పుడు కూడా వి ఆర్ కు వెళ్ళినా .. మళ్లీ పోస్టింగ్ ఎలా వేయించుకోవాలో మామ జీ కు తెలిసినంతగా మారెవరికి తెలియదని విశ్వసనీయ సమాచారం ...? పేకాట, కోడిపందెలు, గంజాయి మాఫియా లాంటి రైడ్ లు జరిగి నిందుతులను పట్టుకున్నప్పుడు నగదు, బంగారం కొంత సైడ్ చేస్తారని, శాఖలో తోటి ఉద్యోగులే బహిరంగంగా మాట్లాడుకోవడం..? ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొసమెరుపు ఏంటంటే ఏ స్టేషన్ కి వెళ్ళిన కోడిపందాలు ఆడుతున్న సమయంలో కోడిపందాలు ఆడిన వారిని పట్టుకుని ఆ పట్టుకున్న సమయంలో మేలు రకం జాతి కోడి పుంజులను సైడ్ చేసి ...? తన తండ్రిని పంపించి అక్కడ నుంచి ఆ మేలురకం కోడిపుంజులను లక్షల్లో అమ్మించి వ్యాపారం చేసాడని విశ్వసనీయ సమాచారం...? సాదా సీదా కుటుంభం నుంచి వచ్చిన బాదం పప్పు కు ఈ ఉద్యోగం కూడా జ్యోతుల నెహ్రూ దయ తోనే వచ్చిందని విశ్వాసనీయ సమాచారం.... అందుకే ఎప్పుడు తన ఇంటికి కాకినాడ జిల్లా గండేపల్లి మండలం వెళ్ళిన జగ్గంపేట నియోజకవర్గం లో ఉన్న రాజకీయ నాయకుడు జ్యోతుల నెహ్రూ ను కలిసి వస్తాడని సమాచారం ... ఈ అన్నీ అంశాలపై ఉన్నతాధికారులు స్పందిస్తారా...! అధికారిక విచారణ జరుపుతారా..? లేదా అన్నది వేచి చూడాల్సిందే ....

**ఎపిసోడ్ -20**

**సాహసం చేయరా డింబకా .. ఆ అవినీతి ప్రోపర్టీల కథల చిట్టా.. ప్రాణం సత్తిపండు వద్ద ఉందిలే ..?**

# బడుల్లో బ్రేక్‌ఫాస్ట్

వేసవి సెలవుల అనంతరం తెలంగాణ వ్యాప్తంగా సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అల్పాహార పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలోని 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, దీని ద్వారా సుమారు 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ పథకం కింద విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మిగిలిన మూడు రోజులు రాగి మాల్ట్ అందిస్తారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులందరికీ ఈ అల్పాహారం వర్తిస్తుంది. ఇప్పటికే అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా విస్తరించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడం, హాజరు శాతం పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. చాలా రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థుల సందడి నెలకొంది. కొత్త దుస్తులు, బ్యాగులతో విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. "పాఠశాల కేవలం పాఠాలు నేర్పే ప్రదేశం కాదు. మన వ్యక్తిత్వాన్ని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే దేవాలయం. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని నేను గట్టిగా నమ్ముతున్నాను. అందుకే విద్యా రంగాన్ని అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టాం" అని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. "అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి పౌష్టికాహారం అందించడమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకోవాలి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జ్ఞానాన్ని సంపాదించి, మీ కలలను సాకారం చేసుకోవాలి. విద్య అనేది ఎవరూ దొంగిలించలేని గొప్ప సంపద" అని విద్యార్థులకు సూచించారు.

# తెలంగాణ అమరవీరుల గుర్తింపులో జాప్యం..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 12 ఏళ్లు గడుస్తున్నా, ఉద్యమ అమరవీరులను సముచితంగా గుర్తించి గౌరవించడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, వారి బలిదానాలు తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. "ప్రజలు ప్రాణత్యాగాలు చేసేంత గొప్ప నేల అది. అందుకే నాకు ఆ నేల పట్ల, అక్కడి ప్రజల పట్ల ఎంతో గౌరవం ఉంది. ఒక లక్ష్యం కోసం ఇంతమంది ఆత్మబలిదానాలు చేసుకుంటారా అనిపించింది" అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో అమరవీరులకు నివాళులర్పించేందుకు తాను వెళ్లాలని

భావించగా, ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని ఈ సందర్భంగా ఆరోపించారు.

యువతను బలిచేసి కొందరు నాయకులు తెలంగాణలో అధికార పీఠాన్ని అధిరోహించారని ఆయన విమర్శించారు. తెలంగాణ ఉద్యమ అసలు ఆకాంక్షల సాధన కోసం జనసేన నిరంతరం శ్రమిస్తుందని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి భవిష్యత్తు ప్రయోజనాల కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి...

యువతలో ఆన్‌లైన్‌లో సంచలనంగా మారిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై దాడి జరిగింది. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం ఓ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఒక్కసారిగా చెంపపై కొట్టడంతో దీప్కే ఆత్మరక్షణ కోసం ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర కలకలం రేగింది. నీట్ పేపర్ లీక్, దేశంలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలోని లోపాలపై సీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జైపూర్‌లోని షహీద్ స్మారక్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం జరుగుతుండగానే అభిజీత్ దీప్కేపై ఈ దాడి జరిగింది. ఆందోళన చేస్తున్న అభిజీత్‌ను ఓ గుంపు అడ్డుకుని దాడికి పాల్పడింది. దాంతో, అభిజీత్ పై దాడికి పాల్పడిన వారిని పట్టుకుని కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు చితకబాదారు.

కొందరు యువతను 'బొద్దింకలు' అంటూ సీజేఐ చేసిన ఓ వివాదాస్పద వ్యాఖ్యకు వ్యంగ్యాస్త్రంగా, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో చదువుతున్న 30 ఏళ్ల అభిజీత్ దీప్కే మే నెలలో 'కాక్రోచ్ జనతా పార్టీ'ని ప్రారంభించారు. అనతికాలంలోనే ఈ ఉద్యమం యువతను ఆకట్టుకుని ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. గతంలో ఢిల్లీ, పుణె నగరాల్లో నిరసనలు చేపట్టిన ఈ బృందం, జైపూర్‌లోనూ ఆందోళనకు పిలుపునిచ్చింది. అయితే, క్షేత్రస్థాయిలో నిరసన తెలుపుతుండగా ఆయనపై దాడి జరగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## అమెరికా-ఇరాన్ డీల్.. స్వాగతించిన మోదీ

- మొదటి పేజి తరువాయి

ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం" అని మోదీ రాసుకొచ్చారు.

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది. దీనిపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న ఇరుదేశాలు సంతకాలు చేయనున్నాయి. హర్మూజ్‌లో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఈ జలసంధిని పూర్తిగా తెరవడం, ఇరాన్ చమురుపై ఆంక్షలు తదితర అంశాలపై ఇరుదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలిసింది.

## టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ.. సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు

సింగపూర్ లో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, సోమవారం అక్కడ కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో భేటీ అనంతరం ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్-సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా ఏపీలోని విమానాశ్రయాల నుంచి సింగపూర్‌కు, అలాగే ఇతర ప్రాంతాలకు విమాన సర్వీసులు, ఎయిర్ కనెక్టివిటీని పెంచే అవకాశాలపై ఫలవంతమైన చర్చలు జరిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందిస్తున్న అవకాశాలను సింగపూర్ విదేశాంగ మంత్రికి వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణ ప్రణాళికలను, దాని భవిష్యత్ దార్శనికతను ఆయనకు తెలియజేశారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ ఆంధ్రప్రదేశ్ వేగంగా అగ్రగామి రాష్ట్రంగా ఎదుగుతోందని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి లభ్యతతో పాటు, సేవల రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీలో పుష్కలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టుల ద్వారా సరకు రవాణాకు ఉన్న అనుకూలతలను ప్రస్తావించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ దేశంలోనే కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటు, ప్రపంచంతో ఏపీని అనుసంధానించే సబ్-సీ కేబుల్ ప్రాజెక్టుల గురించి తెలిపారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా తీర్చిదిద్దుతున్నామని, ఉత్తరాంధ్రలో ప్రపంచ దిగ్గజ ఉక్కు సంస్థ ఆర్సెలార్ మిట్టల్ భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశానికి ముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతి సహా రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్‌లో సింగపూర్ నైపుణ్యాన్ని, సహకారాన్ని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన రంగాలతో పాటు యూనివర్సిటీల్లో పరిశోధనలకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్, కెపాసిటీ బిల్డింగ్‌లో సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పంటల గురించి సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో పండిస్తున్న ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి ద్వారా రెండు ప్రాంతాలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ చర్చల సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, అమరావతి రాజధాని నిర్మాణం గురించి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల గురించి ఆసక్తి కనబరిచారు. దీనికి చంద్రబాబు బదులిస్తూ, ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలవనుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సమావేశాల్లో సీఎం వెంట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి - జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశం

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

ప్రజల సంతృప్తే లక్ష్యంగా వారి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ' మీకోసం ' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ మాధురి, డిపిఓ వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ శాంతిలక్ష్మిలతో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 275 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అర్జీలను సకాలంలో, సహేతుకంగా పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించలేని పక్షంలో అందుకుగల కారణాలను కూడా ప్రజలకు వివరించాలని చెప్పారు. తరచూ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని, పునరావృతం అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులందరూ తమ లాగ్ ఇన్ లో పెండింగ్ ఉన్న అర్జీలను ప్రతిరోజూ పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు



తీసుకోవాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ తో పాటు పల్లెనిద్ర, నియోజకవర్గస్థాయి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాల్లో వస్తున్న అర్జీలకు అధిక ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# కందుకూరు సబ్ డివిజన్ పోలీసులకు ఎస్పీ దిశానిర్దేశం

## -పెండింగ్ కేసులపై వేగం -గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం





**కందుకూరు పెన్ పవర్, జూన్ 15:**

ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు నేర నియంత్రణలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరుపై సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు.సబ్ డివిజన్ పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ) కేసుల పరిష్కారం, కొత్త క్రిమినల్ చట్టాల అమలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న యూఐ కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాత కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నాణ్యమైన విచారణ చేపట్టాలని పేర్కొన్నారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల కేసుల్లో పటిష్టమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పేకాట, కోడి పందాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి అవసరమైతే బైండోవర్ చర్యలు చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా మహిళా భద్రత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కుంభాకార దర్పణాలు (కన్వెక్స్ మిర్రర్లు) ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. జాతీయ రహదారులపైకి ప్రవేశించే సమయంలో వాహనదారులు తప్పనిసరిగా వాహనాన్ని ఆపి ఇరువైపులా పరిశీలించిన తర్వాత మాత్రమే ముందుకు సాగాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవర్లు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రాణాపాయమని హెచ్చరించారు. కొత్త క్రిమినల్ చట్టాల అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణలో పారదర్శకత ఉండాలని సూచించారు. కందుకూరు సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్లలో యూఐ, ప్రాపర్టీ, మిస్సింగ్ కేసుల దర్యాప్తు సంతృప్తికరంగా ఉందని ఎస్పీ అభినందించారు.ఈ సమావేశంలో కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, కందుకూరు సీఐ అన్వర్ బాషా, గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, దర్శి సీఐ రామారావు, కొండేపి సీఐ రమణయ్య, సబ్ డివిజన్ ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై లోకేష్‌తో ఎమ్మెల్సీల భేటీ

## -ఇన్ సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్

## -ఏజ్ రిలాక్సేషన్, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై సానుకూల స్పందన

**కందుకూరు పెన్ పవర్, జూన్ 15:**


ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పట్టభద్రుల ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి రావు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రంగోపాల్ రెడ్డి సోమవారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి (హెచ్ఆర్‌డీ) శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్సీలు తెలిపారు.ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహించాలని ఎమ్మెల్సీలు కోరగా, త్వరలో ప్రత్యేక టెట్ నిర్వహణకు అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ నిర్ణయం వేలాది మంది ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. అదేవిధంగా ఏపీపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు వయో పరిమితిలో సడలింపు (ఏజ్ రిలాక్సేషన్) కల్పించాలని ఎమ్మెల్సీలు కోరారు. ఈ అంశంపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే నిరుద్యోగ యువతకు ఇది ఊరట కలిగించే అవకాశముంది. కాంట్రాక్ట్, ఎంటీఎస్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ప్రస్తుతం ఉన్న 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు



పెంచాలని ఎమ్మెల్సీలు కోరగా, ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి పేర్కొన్నట్లు సమాచారం. మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈవో) నామెన్‌క్లేచర్ మార్పు అంశంపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన పరిపాలనా అంశాలను ప్రభుత్వం పరిశీలించనున్నట్లు సమాచారం. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలపై ఎమ్మెల్సీలు ప్రస్తావించగా, ప్రభుత్వం ప్రతి నెలా రూ.200 కోట్ల మేర నిధులు విడుదల చేస్తోందని మంత్రి నారా లోకేష్ వివరించినట్లు వెల్లడించారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో ప్రభుత్వ స్థాయిలో తీసుకునే నిర్ణయాలపై ఆయా వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# మక్కెనవారిపాలెం పాఠశాలలో విషనాగు కలకలం

## - విద్యార్థుల భద్రతపై అధికారుల నిర్లక్ష్యమా?



**పెన్ పవర్, సంతమాగులూరు, జూన్ 15**

సంతమాగులూరు మండలంలోని మక్కెనవారి పాలెం ఎంపీపీ పాఠశాలలో సోమవారం విషనాగు ప్రత్యక్షమవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్డిలో విషపూరిత నాగుపాము కనిపించడంతో విద్యార్థులు అక్కడికి వెళ్లేందుకు సాహసం చేయలేకపోయారు. స్థానికులకు సమాచారం అందించినప్పటికీ చాలా సేపటి వరకు పాము బయటకు రాకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనతో పాఠశాలలో భద్రతా లోపాలపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ప్రహరీ గోడ లేకపోవడమే ప్రధాన సమస్య**

పాఠశాలకు పూర్తిస్థాయి ప్రహరీ గోడ లేకపోవడం వల్ల సమీపంలోని పొదలు, వ్యవసాయ భూముల నుంచి పాములు, తేళ్లు, ఇతర విషపూరిత కీటకాలు తరచూ పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. చిన్నారులు చదువుకునే ప్రదేశంలో ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు నెలకొనడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. గతంలో కూడా పలు సందర్భాల్లో పాములు కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?**

ప్రభుత్వం విద్యా ప్రమాణాల పెంపుతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో ప్రాథమిక భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ పాము విద్యార్థులను కాటేస్తే దానికి బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్న తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

**అధికారులు తక్షణం స్పందించాల్సిన అవసరం**

పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు, క్రమం తప్పకుండా పరిశుభ్రత చర్యలు



చేపట్టడం, మరుగుదొడ్లు మరియు తరగతి గదుల వద్ద భద్రతా తనిఖీలు నిర్వహించడం అత్యవసరంగా మారింది. మండల విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ప్రమాద ఘంటికగా మారిన నాగుపాము ఘటన**

మక్కెనవారిపాలెం పాఠశాలలో కనిపించిన విషనాగు కేవలం ఒక సంఘటన మాత్రమే కాకుండా, పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతుల లోపాలను బహిర్గతం చేసిన ప్రమాద ఘంటికగా భావించాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో అధికారులు ఇకనైనా స్పందించి ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేసి, పాఠశాలను సురక్షిత వాతావరణంగా మార్చాలని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.


# నిత్య యోగాతో ఆరోగ్య భాగ్యం

- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు - కొత్తపట్నం బీచ్ లో యోగ సాధన
- పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ సీతారామయ్య, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ









**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

ఆరోగ్యభాగ్యానికి నిత్య యోగానే ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు చెప్పారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుండే యోగా సాధన చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో జరుగుతున్న యోగ సాధనలో భాగంగా సోమవారం కొత్త పట్నం మండలం పల్లెపాలెం బీచ్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్యలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ పంచభూతాల సంగమ ప్రాంతంలో ఉత్సాహంగా వారు యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనదేశంలో పుట్టి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన గొప్ప కళ యోగా అన్నారు. ప్రజలందరి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం 'యోగాంధ్ర' కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతమైన పల్లెపాలెం బీచ్‌లో యోగా కార్యక్రమం నిర్వహించడం పర్యాటకానికి, ఆరోగ్యానికి రెండింటికీ మంచిదని అభిప్రాయపడ్డారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా సాధన అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య, సంతోష, సంపన్నవంతమైన రాష్ట్ర ఆవిష్కరణ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అందరూ యోగా సాధన చేయాలన్నారు. సీతారామయ్య మాట్లాడుతూ జీవనశైలిని మార్చుకోవటం ద్వారా దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. దీనికి యోగా సాధన అత్యుత్తమమని చెప్పారు. పతంజలి యోగా సంస్థ నిపుణుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి తేళ్ల రవికుమార్, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ భీమ్ నాథ్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, 500 మందికిపైగా విద్యార్థులు, స్థానిక ప్రజలు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు.

# అక్రమంగా తరలి వెళ్తున్న రేషన్ బియ్యం పట్టివేత

## కడప జిల్లా బద్వేలుకు తరలి వెళ్తున్న రేషన్ బియ్యం లారీని పట్టుకున్న కొమరోలు ఎస్సై నాగరాజు.

**కొమరోలు పెన్ పవర్ జూన్ 15**

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం ఉదయం 5 గంటల సమయం లో మదవపల్లి బస్ స్టేజి సమీపంలో పట్టుకున్నామని కొమరోలు ఎస్సై జె. నాగరాజు తెలిపారు. కొమరోలు నుంచి కడప జిల్లా బద్వేలుకు అక్రమంగా రేషన్ బియ్యం తో లారీ వెళుతున్నట్లుగా సమాచారం అందటంతో తాను తమ సిబ్బందితో మాధవపల్లి బస్ స్టేజి సమీపంలో సోమవారం ఉదయం 5 గంటల సమయంలో కాపు కాచి లారీని పట్టుకున్నామని ఎస్ఐ నాగరాజు తెలిపారు . లారీని కొమరోలు పోలీస్ స్టేషన్ కు తరలించామని, లారీలో దాదాపు 9 టన్నుల రేషన్ బియ్యం తో ఉన్న మూటలు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. లారీ డ్రైవర్ దేవాను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న ట్లుగా ఎస్సై నాగరాజు తెలిపారు.





# జిల్లా పోలీసుల ముమ్మర గస్తీ

## – ఏటీఎంలు, లాడ్జిలు,ప్రధాన వ్యాపార కేంద్రాలపై ప్రత్యేక నిఘా

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం... నేరాల నియంత్రణే, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది రాత్రి వేళల్లో గస్తీ విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం రాత్రి దర్శి డీఎస్పీ బాలమురళీకృష్ణ పర్యవేక్షణలో స్పెషల్ పార్టీ సిబ్బంది వెపన్ (తుపాకీ)తో ఒంగోలు పట్టణంలో విస్తృతంగా గస్తీ నిర్వహిస్తూ నైట్ పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నారు. దొంగతనాలు, ఇతర నేర సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. జిల్లాలోని ఏటీఎంలు, బ్యాంకులు, ప్రధాన వ్యాపార కేంద్రాల వద్ద భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేస్తూ, ఏటీఎం కేంద్రాల వద్ద పోలీసులు నిరంతర గస్తీ నిర్వహిస్తూ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పరిశీలిస్తున్నారు. సెక్యూరిటీ గార్డ్స్ ను అలెర్ట్ చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించడంతో పాటు,



వాహనాలను తనిఖీ చేసి వాటి రవాణా వివరాలను సేకరిస్తున్నారు. పాత నేరస్తులు, చెడునడత కలిగిన వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, మొబైల్ చెక్ డివైసుల ద్వారా వారి వివరాలను తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో ఎటువంటి నేరలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన నిఘా గస్తీ చర్యలు చేపట్టారు. లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్కడ ఉండే వారి ఆధార్ వివరాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. ఎవరైనా



చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించే దిశగా, రాత్రి వేళల్లో అల్లర్లు, గొడవలు, దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, కారణం లేకుండా తిరిగే ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

## రైల్ క్రిందపడియువకుడి మృతి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 15**

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం నాడు చోటు చేసుకుంది. గిద్దలూరు –నంద్యాల రైలెమార్గంలో దిగువమెట్ట చలమ గ్రామాల నల్లమల మధ్య అటవీ ప్రాంతంలో ని రైల్వే ట్రాక్ పై ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు .ఉదయం కీ మెన్ గమనించి రైల్వే అధికారుల కు సమాచారం అందించారు. నంద్యాల రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తేళ్ల అరుణకు అభ్యుదయ కవితా చూడామణి బిరుదు ప్రదానం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 15**

అద్దంకిలో నందమూరి కళా పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ కి అభ్యుదయ కవితా చూడామణి బిరుదు ప్రదానం చేశారు. నందమూరి కళాపరిషత్ అద్దంకి వారి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ వర్ధంతి సందర్భంగా తేళ్ల అరుణను ప్రధాన వక్త గాఆహ్వానించి తదనంతరం ఆమెకు అభ్యుదయ కవితా చూడామణి అనే బిరుదును ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు .ఈ సభకు కళాపరిషత్ అధ్యక్షుడు త్రిమూర్తులు అధ్యక్షత వహించగా ప్రధాన కార్యదర్శి నాగినేని రామకృష్ణ ,గాడేపల్లి దివాకర్ దత్ అతిథులుగా పాల్గొన్నారు. సభ ఆద్యంతం శ్రీ శ్రీ కవితలతో ఉత్సాహభరితంగా సాగింది. సభానంతరం నరసం రాష్ట్ర గౌరవా ధ్యక్షురాలు తేళ్ల అరుణను శాలువా, మేమెంటో నగదు బహుమతితో ఘనంగా సన్మానించారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం పొందిన దమ్మాల



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 15**

గిద్దలూరు విశ్రాంత ఉద్యోగుల సంగంలో దమ్మాల హరిప్రసాద రావు సోమవారం నాడు సభ్యత్వం తీసుకున్నారు. హరిప్రసాద్ గత నెల గిద్దలూరు ఎబిసిడబ్ల్యు ఓ పదవి విరమణ చేశారు. వసతి గృహ సంక్షేమాధికారిగా వివిధ ప్రాంతాల్లో పని చేసి , గత తొమ్మిది మాసాలక్రితం ఎబిసిడబ్ల్యుఓ గా పదోన్నతిపొంది మే 31న పదవి విరమణ చేశారు. దీంతో హరిప్రసాద్ విశ్రాంత ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం సవీకరించారు. ఈ సందర్బంగా ఆ సంఘ అధ్యక్షులు జి రవీంద్రనాథరెడ్డి హరిప్రసాద్ కు సభ్యత్వం ఇచ్చి సంఘంలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో సూరే కొండయ్య, సూరే సుబ్రహ్మణ్యం, ఎమ్ భాస్కర్ రెడ్డి, పి తిమోతి , తదితరులు పాల్గొన్నారు అనంతరం తే నీటి విందు ఏర్పాటు చేశారు

## "మీకోసం"లో 39 ఫిర్యాదులు...

## త్వరిత పరిష్కారానికి పోలీసుల హామీ

**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూన్ 15**

మార్కాపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన "మీకోసం" కార్యక్రమంలో 39 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. డీఎస్పీ యు. నాగరాజు నేతృత్వంలో అధికారులు బాధితుల సమస్యలను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. భూ వివాదాలు, ఉద్యోగ, ఆర్థిక మోసాలు, కుటుంబ కలహాలు తదితర అంశాలపై ఫిర్యాదులు నమోదయ్యాయి. సంబంధిత పోలీస్ స్టేషన్లకు కేసులు పంపించి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు అర్బన్ సీఐ కె. సురేష్, కనిగిరి సీఐ శ్రీనివాసరావు, కంభం సీఐ కె. మల్లికార్జునరావు తదితర అధికారులు పాల్గొన్నారు.



# సత్యానికి ప్రతిరూపం "సైన్స్"

## శాస్త్ర ప్రచార ఉద్యమంలో జనవిజ్ఞాన వేదిక ప్రస్థానం 38 సంవత్సరాలు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 15**

రాజు పారామెడికల్ కాలేజ్ ఆవరణలో జరిగినశాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో భాగస్వాములుగా చేరండి అనే పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పి స్వరూప రెడ్డి మాట్లాడుతూ ఆది కాలము నుండి ఆధునిక కాలం వరకు, వానరుడు నుండి నరుని వరకు, రాతి యుగము నుండి రాకెట్ యుగం వరకు, పూరి గుడిసె వాసి నుండి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు జరుగుతున్న పరిణామములో శాస్త్రము, శాస్త్రీయత, శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ ఆలోచన ఉంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు అన్నారు. విశ్వంగురించిశోధించి తెలుసుకుంటున్నాం. మనిషి ఆయుర్దాయం పెరగడానికి కారణమైన జన్యువును గుర్తించగలిగాం. ఉపగ్రహాలను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపుతున్నాం కానీ ఇంకా సమాజంలో అశాస్త్రీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందన్నారు. దీనికి కారణం సైన్స్ పాఠ్య గ్రంథాలలో పాఠ్యాంశంగా ఉంటున్నది తప్ప జీవన విధానంగా మారలేదన్నారు. శాస్త్రీయ ఫలితాలు సామాన్య ప్రజలకు చేరాలనే ఆలోచనతో అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమము, కూల్ డ్రింక్స్ వ్యతిరేక ప్రచారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, పిల్లల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి చెకుముకి సైన్స్ సంబరాల నిర్వహణ, చెకుముకి పత్రిక నిర్వహణ సమ్మర్ క్యాంపులు, సైన్స్ జాతాలు, మ్యాజిక్ ప్రదర్శనలు, ఉపాధ్యాయులకు శిక్షణ మొదలగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, సమాజంలో తర్కించే తత్వాన్ని, పరిశీలించే గుణాన్ని , ఆలోచించే శక్తిని పెంపొందించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లా జనవిజ్ఞాన వేదిక మాజీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అనారోగ్యం ఉన్నచోట వైద్యంతో కూడిన శాస్త్ర చికిత్స ఎంత ముఖ్యమో, అజ్ఞానం ఉన్నచోట జ్ఞానముతో కూడిన శాస్త్రీయ ప్రభావం అంతే ముఖ్యమన్నారు. శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందే కొద్దీ మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు పటాపంచలై శాస్త్రీయ భావాలు ప్రజల్లో ఏర్పడతాయని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎ.విశ్వరూపం మాట్లాడుతూ సైన్స్ అంటే రసాయనాలు, పరిశోధనలే కాదు. సువిశాల సమాజం కూడా. మన చుట్టూ ఉన్న అనేక సమస్యలకు సైన్స్ తోనే పరిష్కారం అన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానము అభివృద్ధి చెందే కొద్దీ మూఢనమ్మకాలు, అందవిశ్వాసాలు పటాపంచలై శాస్త్రీయ భావాలు ప్రజల్లో ఏర్పడతాయని, సైన్స్ తగ్గిపోయే కొద్ది చాందస భావాలు ప్రభలుతాయని, హేతువాదము కనుమరుగు అవుతుందని, మానవత్వము మట్టి పాలవుతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులలో సృజనాత్మకత, ఊహాశక్తిని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ,జనవిజ్ఞాన వేదిక నాయకులు కొండేటి రాజా ప్రవేట్ పాఠశాలల మాజీ అధ్యక్షులు కే రామిరెడ్డి జనవిజ్ఞాన వేదిక నాయకులు వి శ్రీనివాసులు టీవీ కృష్ణయ్య వెంకటేశ్వరరావు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## మహోన్నత సాహితీ శిఖరాలు

# శ్రీ శ్రీ,... నాగభైరవ

**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు జూన్ 15**

శ్రీ శ్రీ ఓ వ్యక్తి కాదు ఒక మహాశక్తి అని, శ్రీశ్రీ అంటే పరిచయం లేని తెలుగువారుండరని,సాహిత్య చరిత్రలో మర్చిపోలేని గొప్ప అభ్యుదయ కవి శ్రీ శ్రీ అయితే ఎందరో యువకులకు మార్గదర్శకులై, స్ఫూర్తి నింపి వారి భుజంతట్టి ప్రోత్సహించిన జాతీయ కవి నాగభైరవ కోటేశ్వరరావు అని పేర్కొంటూ ఒకరు మహాప్రస్థానం కావ్యంతో, మరోకరు కవనవిజయం రూపకంతో సంచలనాలను సృష్టించారని నవ్యాంధ్ర రచయితల సంఘం (నరసం) రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ పేర్కొన్నారు. స్థానిక ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలోని నరసం కార్యాలయం నందు సోమవారం సాయంత్రం నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం), కళామిత్ర మండలి (తెలుగు లోగిలి)జాతీయ సంస్థల సంయుక్త నిర్వహణలో మహాకవి శ్రీ శ్రీ 43వ, జాతీయకవి డా.నాగభైరవ కోటేశ్వరరావు 18వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ అధ్యక్ష వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ మహాకవిగా హేతువాదిగా, నాస్తికుడుగా, విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించి,తన రచనల ద్వారా అత్యంత ప్రజాదరణ పొందిన వాడు శ్రీశ్రీ అని, జాతీయకవిగా, సాహితీవేత్తగా,సినిమా మాటల రచయితగా, సంప్రదాయ ఛందో కవితా రచనల్లోనూ అందె వేసిన చేయిగా సమాజ శ్రేయస్సును కోరుతూ రచనలు చేసిన వాడు డా. నాగభైరవ కోటేశ్వరరావు అని తెలిపారు. కళామిత్రమండలి(తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు మాట్లాడుతూ సమాజాన్ని ప్రశ్నించండి, మార్పు కోసం పోరాడండి అంటూ బానిస బతుకుల గొంతుకగా మారి ప్రజల జీవితాన్ని,వారి బాధలను, పోరాటాన్ని కవిత్వంలో ప్రతిబింబింపజేసిన మహానుభావుడు శ్రీశ్రీ ఐతే 'స్పష్టత, సమగ్రత,



సుందరత, సజీవతల మేలు కలయికే నాగభైరవ సాహిత్యమని' తెలియజేశారు. శ్రీశ్రీ గా ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రను తన కవిత్వంతో శాసించిన యుగపురుషుడని నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ పలు పద్య ,గద్య కావ్యాలతో పాటు కొన్ని రూపకాలను, సినిమాలకు కథలను, సంభాషణలను,పాటల ను రాసి తెలుగు సాహిత్యాన్ని పండించిన కృషీవలుడు నాగభైరవ అని కీర్తించారు. ఈ కార్యక్రమంలో తెలికా ఉద్యమ ప్రచారకురాలైన మానేపల్లి సూర్య కుమారి ప్రముఖ కవి యు.వి.రత్నం, వి.ఝాన్సీదుర్గ,బీరం అరుణ, మిడసల మల్లిఖార్జునరావు, గుంటూరు సత్యనారాయణ, కేయస్వీ ప్రసాద్,కోవెలకుంట్ల బాలకోటయ్య, ఓరుగంటి ప్రసాద్ తదితరులు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు శ్రీ శ్రీ, నాగభైరవల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రవీణ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గిద్దలూరు వాస్తవ్యులు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 16**

గిద్దలూరు వైసిపి నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఎర్రగొండపాలెం పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి ని హైదరాబాదులోని ఉప్పల్ లో గిద్దలూరు నియోజకవర్గ వాస్తవ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రవీణ్ కుమార్ రెడ్డి తో వారు చర్చించారు. వృత్తిరీత్యా హైదరాబాదులో ఉంటున్న తమ అభిమానాన్ని చాటు కుంటూ గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధి, తదితర అంశాలపై ప్రవీణ్ కుమార్ రెడ్డి తో మాట్లాడారు. తమ మద్దతు ఎప్పుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి కి ఉంటుందని గిద్దలూరు వాస్తవ్యులు తెలిపారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఓట్ల జాబితా పై పరిశీలించుకోవాలని ప్రవీణ్ కుమార్ రెడ్డి వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ పరిసర ప్రాంతాలకు చెందినవారు పాల్గొన్నారు.

## చలో విజయవాడను జయప్రదం చేయాలి

### రైతు సంఘం నాయకుల పిలుపు



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ జూన్ 15**

రైతులు,కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న నిర్వహించనున్న "చలో విజయవాడ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు.సోమవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవనంలో రైతు సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు బాణాల రామయ్య మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసినట్లుగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, కౌలు రైతులకు ఎలాంటి హామీలు లేకుండా రూ.2 లక్షల వరకు రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు నెలకు రూ.10,000 పెన్షన్ మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరగనున్న ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రైతులు, కౌలు రైతులు, రైతు సంఘ నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు అందే నాసరయ్య, మార్కాపురం నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.ఖాసిం, గిద్దలూరు, మార్కాపురం ఏపీ రైతు.

## నారాయణస్వామికి ఆదాయం రూ. 1,38,334/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.1,38,334/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 71,290/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,680/- లు, శాశ్వత అన్నదాన పథకం నకు ద్వారా విరాళములు రూ,11,348/- లు , స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .5,516/- లు, మహా ప్రాకార నిర్మాణమునకు రూ.12,500/- లు వచ్చినట్లు తెలిపారు.

# అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించిన మహాకవి శ్రీ శ్రీ..

## అక్షరాలకు ఆవేశం తొడిగాడు, కవిత్వాన్ని కదం తొక్కించాడు, కష్టజీవికి ఇటు నిలిచాడు, సమ సమాజ సాధనకు కలం పట్టాడు . ఆయనే శ్రీ శ్రీ.. - జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి స్వరూపరెడ్డి






**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 15**

మళ్లీ చెప్తున్నా కన్నీరు కారిస్తే కాదు, చెమట చుక్క చిందిస్తేనే చరిత్రను రాయగలం అని తెలుసుకో. చదివితే ఇది పదాలు మాత్రమే. కానీ ఆచరిస్తే అస్త్రాలని శ్రీశ్రీ పేర్కొన్నారని జనవిజ్ఞానవేధిక రాష్ట్ర కార్యదర్శి పి స్వరూపరెడ్డి పేర్కొన్నారు జనవిజ్ఞాన వేదికలో శ్రీ శ్రీ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి పాల్గొని ప్రసంగించారు. మహాకవి శ్రీ శ్రీ మాటలు అందరికీ భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలో అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. తన కవిత్వంతో తాడిత, పీడిత వర్గాల వారి బాధల్ని బాహ్య ప్రపంచానికి తెలియ జేశారు శ్రీ శ్రీ.

**'నేను సైతం..**

ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను, నేను సైతం... ప్రపంచాబ్దపు తెల్లరేకై పల్లవిస్తాను, నేను సైతం.. విశ్వ వీణకు తంత్రినై మూర్చనలు పోతాను, నేను సైతం... భువన భవనపు బావుటానై పైకి లేస్తాను' అని ప్రపంచ అభ్యుదయం కోసం ఎన్నో త్యాగాలు చేసి కూడా, మానవ జాతి చరిత్రలో పేరుకు కూడా నోచుకోని శ్రమ విలువను, శ్రామికుడి గొప్పతనాన్ని గుర్తించాలని ఎలుగెత్తి నినదించిన మహాకవి శ్రీశ్రీ. అన్నారు. కవిత్వాన్ని జీవితానికి దగ్గరగా తీసుకు వచ్చి, నిద్రపోతున్న జాతిని ఒక్క చరుపు చరిచి లేపి అదిగో మరో ప్రపంచం అని కాంతి రేఖను చూపిన నవయుగ వైతాళికుడు శ్రీశ్రీ. యని ఒక దశాబ్దం పాటు ఆంధ్ర సాహిత్యలోకాన్ని ఉత్తేజ పరిచిన అభ్యుదయ కవితోద్యమ మూల విరాట్టు శ్రీశ్రీ.అన్నారు. భావ కవిత్వానికి విరుద్ధంగా జెండా ఎత్తడమే కాక శ్రామిక వర్గ చైతన్యం ఊపిరిగా కలిగిన కొత్త కవితా రీతికి పాదులు వేసి స్రష్ట శ్రీశ్రీ. భావకవుల చేతుల్లో వైదర్భీరీతిలో సాగిన గేయాన్ని గౌడీరీతిలో నడిపించిన ఛందో రహస్యవేత్త శ్రయని పేర్కొన్నారు. శ్రీశ్రీ పూర్తి పేరు.. శ్రీ రంగం శ్రీనివాసరావు. ఆయన 1910లో విశాఖపట్నంలో జన్మించారు. తల్లిదండ్రులు పూడిపెద్ది వెంకట రమణయ్య, అప్పలకొండ. శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడు అవటం వల్ల ఇంటిపేరు శ్రీరంగంగా మారిందని. శ్రీశ్రీ ప్రాథమిక విద్యాభ్యాసాన్ని విశాఖపట్నంలో పూర్తిచేశాడు. 1925లో ఎస్ఎస్ఎల్సి పాసయ్యాడు. అదే సంవత్సరం వెంకట రమణమ్మతో పెళ్ళి జరిగింది. 1931లో మద్రాసు విశ్వ విద్యాలయంలో బిఎ పూర్తి చేశాడు. 1935లో విశాఖలోని మిసెస్ ఎవిఎన్ కాలేజీలో డిమాన్‌స్ట్రేటరుగా చేరాడన్నారు. 1938లో మద్రాసు ఆంధ్రప్రభలో సబ్ ఎడిటరుగా చేరి. తరవాత ఆకాశవాణిలోనూ, మిలిటరీలోనూ, ఆంధ్రవాణి పత్రికలోనూ వివిధ ఉద్యోగాలు చేశాడన్నారు. ఎనిమిదో ఏటనే కందపద్యం రచించి. చిన్నతనంలోనే నటనానుభవం సంపాదించారు. తెలుగు కావ్యాలు చదువుకున్నారు. బాల్యంలోనే 'సావిత్రీ సత్యవంతుడు' అనే పద్య నాటకం రచించారని. 15వ ఏటకే ఛందస్సుపై పట్టు సాధించి 'విశ్వ రూప సందర్శనం (1925) అనే గీతమాలికను రచించారన్నారు. దీనినే ఆయన మొట్టమొదటి రచనగా ఆరుద్ర పేర్కొన్నారని తెలిపారు. సాహితీ సమితిలోనూ, కవితా సమితిలోనూసభ్యుడయ్యారు. ఆ తర్వాత 'వీర సింహ విజయసింహాలు, పరిణయ రహస్యం అనే నవలలను, 16 ఖండికలతో 'ప్రభవ' అనే కావ్యాన్ని రాశారన్నారు. దిగంబర కవిత్వాన్ని సమర్థించారని. విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడయ్యారన్నారు. శ్రీశ్రీ అనగానే మహా ప్రస్థానం గుర్తుకొస్తుందని. అందులో 40 ఖండికలు ఉన్నాయి. ఈ సంకలనంలో మొదటి కవిత 'మహా ప్రస్థానం' అయినా ముందుగా రాసిన కవిత 'జయభేరి'. గిబ్సన్ అనే ఆంగ్ల కవి గీతం చదివి దాని ప్రభావంతో శ్రీశ్రీ 'జయభేరి' రచించారన్నారు. ఆరుద్ర పేర్కొనట్లు 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిదనొక్కటి ఆహుతిచ్చాను' అనే గీతం వాడుక భాషకు దగ్గరై శ్రీశ్రీ చేత కొత్త ప్రస్థానానికి జయభేరి మోగింపజేసిందన్నారు. అభ్యుదయ సిద్ధాంతం అంటే ఏమిటి ? సామ్యవాద కవి ఎలా ఉండాలి ? శ్రామిక రాజ్యం గొప్పతనం, పీడిత వ్యవస్థ లక్షణం మొదలైన వాటిని వివరిస్తూ శ్రీశ్రీ రాసిన 'ప్రతిజ్ఞ' కవిత ఆయన కవిత్వానికే కాక అభ్యుదయ సాహిత్యానికే 'మ్యానిఫెస్టో' వంటిదన్నారు. కదిలేది కదిలించేది, మారేది మార్పించేది, పాడేది పాడించేది, పెనునిద్దర వదిలించేది, మునుముందుకు సాగించేది పరిపూర్ణపు బ్రదుకిచ్చేది అని గొప్ప కవితా నిర్వచనం చేసిన శ్రీశ్రీ పీడిత లోకంలో నిరంతరం స్మరించబడుతూనే ఉంటారనిపేర్కొన్నారు. కావాల్సిన స్ఫూర్తిని ఇస్తూనే ఉంటారు. అనితర సాధ్యం ఆయన మార్గం. తెలుగు వారిని ఉర్రూత లూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను శ్రీశ్రీ రచించాడని, సుమారు 280చిత్రాలకు దాదాపు వెయ్యి పాటలు రాశారన్నారు. బహుముఖంగా చిత్రగీతాలు రాసిన శ్రీశ్రీ ఆ రంగంలో అనేక ధోరణులకు ఆద్యులూ అగ్రగణ్యులూ అయ్యారు. మాతృకకు మక్కికి మక్కి కాకుండా అవసరమైన మేరకు మాత్రమే 'లిప్‌సింక్'ను పాటించి, తెలుగు నుడికారంతో డబ్బింగ్ రచనలు చేసి, దానికొక ఒరవడి ప్రవేశపెట్టారన్నారు. వామపక్ష భావజాలంతో సామ్యవాద గీతాలను రాసి సినీ పరిశ్రమలో చైతన్య గీతాలకు అంకురార్పణ చేశారఅంబారు తెలుగు సినిమాల్లో యెక్కువ దేశభక్తి గీతాలను రచించిన ఖ్యాతి కూడా ఆయనకే దక్కుతుందన్నారు మహాప్రస్థానం, ఖడ్గసృష్టి కవితా సంకలనాల్లో ముందుగా వెలువడి, ఆ తరువాత పాటలుగా సినిమాలకెక్కినవి పాతికకుపైనే ఉన్నాయి. ఈ విషయంలో కూడా అగ్రతాంబూలం శ్రీశ్రీదే నన్నారు. 1930 వ దశకంలో తలెత్తిన ఆర్థిక మాంద్యం యావత్ ప్రపంచాన్ని చిన్నాభినం చేసింది. నిరుద్యోగ యువత మొదలుకొని చిరుద్యోగుల వరకూ సమాజంలోని అనేక వర్గాల ప్రజల జీవితాలు అల్లకల్లోలమైన సమయం. ఆ కాలాన్ని ఆకలి ముప్పైలు అంటే హంగ్రీ థర్టీస్‌గా పేర్కొన్నారు. ఈ దశలో వ్యక్తిగతంగానూ, సామాజికంగానూ తన చుట్టూ జరిగిన సాంఘిక పరిణామాలు శ్రీశ్రీ రచనా వస్తువులను నిర్దేశించాయి. రచనా క్రమంలోనూ ఆదిలో పద్యాలను భావకవుల ప్రభావంతో రాసిన శ్రీశ్రీ, క్రమంగా ఇతర భాషల్లోని ప్రక్రియాపరమైన మార్పులు అర్థం చేసుకుంటూ పరిపక్వ దశకు చేరుకున్నాయని.అందుకే ఆయనను మహాకవి అని పిలుస్తారు అని స్వరూపరెడ్డి పేర్కొన్నారు.

# పొదిలిలో సర్ కార్యక్రమంలో పాల్గొన్న కందుల విగ్నేష్



**పొదిలి, పెన్ పవర్, జూన్ 15**

పొదిలిలో జరిగిన సర్ కార్యక్రమంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ రెడ్డి పాల్గొన్నారు. సోమవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో విగ్నేష్ పాల్గొని పరిశీలించారు. అలాగే తెలుగుదేశం నాయకులు ఎండి గౌస్ కుటుంబానికి ఓటర్ హౌస్ మ్యాపింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముల్లా కుద్దూస్, నాయకులు ఎం రబ్బాని, కాటూరి శ్రీను, బి ఎల్ ఓ శివరంజని తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించాలని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కందెర నాగరాజు అన్నారు మండల కేంద్రంలోని వడ్డేపాలెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం యుటిఎఫ్ సబ్ కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు ప్రత్యేక అర్హత పరీక్షలు లేకపోయినా ఉపాధ్యాయులకు మాత్రమే పదేపదే టెట్ నిర్వహించడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే సంవత్సరాల అనుభవం కలిగిన ఉపాధ్యాయులను టెట్ పరిధి నుంచి మినహాయించాలని, లేదంటే సీనియర్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న వైద్య ఖర్చుల భారం దృష్ట్యా మెడికల్ రీయింబర్స్మెంట్ కాలపరిమితిని పొడిగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కుండా వెంకటేశ్వర్లు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జె వెంకట్రావు, యుటిఎఫ్ నాయకులు పటాన్ నాయబ్ రసూల్, జి శ్రీనివాసరాజు, జి లక్ష్మీనారాయణ, షేక్ పాదుషా, ఎన్ వెంకట్రామయ్య, ఐ కొండయ్య, ఎన్ తిరుపతయ్య, హెచ్ వీరాంజనేయులు, వి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



# గిద్దలూరు మున్సిపాలిటీకి నిధుల పరవళ్లు

**అభివృద్ధి లో దూసుకుపోతున్న గిద్దలూరు**

**ఏడాదిలో 10.25 కోట్ల అభివృద్ధి పనులు..**

**ఎమ్మెల్యే ముత్తుముల సహకారం అభినందనీయం..**

**మున్సిపల్ కమీషనర్ ఈ వి రమణ బాబు**



**గిద్దలూరు,పెన్ పవర్ జూన్ 15**

గిద్దలూరు మున్సిపాలిటీలో మౌలిక వసతులు, రోడ్ల నిర్మాణం,డ్రైనేజీ నిర్మాణం,త్రాగునీరు వంటి పనుల చేపట్టి అభివృద్ధి చేసేందుకు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను కలిసి నిధులు రాబట్టడంలో ఆయన కృతకృత్యులయ్యారు. ఆయన కృషిని నాయకులు ప్రజలు ప్రసంసిస్తున్నారు. పనులను వేగవంతంగా, ప్రమాణాలకు తగినట్లుగా సాగించడంలో ఇటీవలనే ఐదేళ్ల పాలన ముగించుకొని నిష్క్రమించిన పాలకవర్గం,కమీషనర్ ఇ. వి.రమణ బాబు,మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు,సిబ్బంది సమిష్టి కృషితో పాలనను, అభివృద్ధిని ప్రగతిపథంలో కొనసాగిస్తున్నారు. 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.13 కోట్లతో 26 పనులు, బి.పి.ఎస్ (భవన జరిమానా పథకం) మరియు ఎల్. ఆర్. ఎస్ ( లే ఔట్ రెగ్యులరైజేషన్ పథకం) ద్వారా రూ.2.73 కోట్లతో 46 పనులు, ఎస్.సి ,ఎస్పీ గ్రాంట్ ద్వారా రూ.54 లక్షలతో 4 పనులు ఓనిడా గ్రాంట్ ద్వారా రూ.41 లక్షలతో 4 పనులు మొత్తం రూ.5.82 కోట్లతో 80 పనులను ఇప్పటికే పూర్తి చేశారు. మరో 32పనులను రూ.4.13 కోట్ల అంచనాలతో ప్రారంభం కానున్నాయి. ఒక్క ఏడాది కాలంలో మొత్తం 10 కోట్ల 25లక్షల 81వేల రూపాయల నిధులతో గిద్దలూరు పురపాలక సంఘం పరిధిలో సి.సి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, త్రాగునీటి సరఫరాకు వినియోగించడం విశేషం.

# పెద్దరాజుపాలెంలో ఎస్ఐఆర్ సమీక్ష సమావేశం

**ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్కరూ బిఎల్వోలకు సహకరించాలి -అట్లూరి రామకృష్ణంరాజు**





**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

మండలంలోని పెద్దరాజుపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై 105, 106 పోలింగ్ కేంద్రాల బీఎల్వోలు బాలాజీ, మనోజ్ కుమార్ అధ్యక్షతన బిఎల్ఎలకు, గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీడీపీ సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బీఎల్వోలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను తొలగించే ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. గ్రామ ప్రజలు, బీఎల్ఎలు సమన్వయంతో సహకరించాలని కోరారు టిడిపి సీనియర్ నాయకులు అట్లూరి రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో పేర్లను నమోదు చేయించుకోవాలని, ఓటర్లు తమ కుటుంబ సభ్యుల వివరాలను బిఎల్ఓ లకు అందజేయాలని సూచించారు ప్రజలు ఓటర్ల జాబితా ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని, ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలని కోరారు అనంతరం బూత్ నెంబర్ 105 లో ఓటర్ల ఇంటి దగ్గరికి వెళ్లి ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాలను అందజేశారు ఈ కార్యక్రమంలో బిఎల్ఎలు డి ఆదినారాయణ, టి సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కాశీ నాయన ఆశ్రమానికి బియ్యం వితరణ



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 15**

గిద్దలూరు లో వెలసిన కాశీనాయన ఆశ్రమములో దాతల సహకారంతో ప్రతి సోమవారం రోజు అన్నదాన కార్యక్రమం చేపడుతూ ఉంటారు అందులో భాగముగా సోమవారం నాడు యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్యుల సహకారంతో 25కేజీల బియ్యం ప్యాకెట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వేణుగోపాల్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న బాధ్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేస్తూ చిన్న చిన్న సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మానవత్వం చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యోగ టీచర్ నారాయణ రెడ్డి సభ్యులు. రత్న సిద్దయ్య పీరయ్య శ్రీనివాసులు నాగరాజు శోభారాణి నరేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి

**మునిసిపల్ కమిషనర్ ను కోరిన కార్మిక సంఘాల నేతలు**



**పొదిలి, పెన్ పవర్, జూన్ 15**

పొదిలి నగర పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని జిల్లా సీఐ టి యు ఉపాధ్యక్షులు నర్రా వెంకటేశ్వర రెడ్డి కోరారు. సోమవారం నాడు పొదిలి నూతన మునిసిపల్ కమిషనర్ ఆంజనేయులు ను కలసి కార్మికుల సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. ముందుగా కమిషనర్ ఆంజనేయులు ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అంద జెసి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడిన కమిషనర్ ఆంజనేయులు సానుకూలంగా స్పందించి, కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు తాను గట్టి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రెడ్డి తో పాటు కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతుల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

**శ్రీ కృష్ణదేవరాయ బలిజ,కాపు సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానం**



**మార్కాపురం పెన్ పవర్ జూన్15**

శ్రీ కృష్ణదేవరాయ బలిజకాపు సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి (2026) పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సమితి సభ్యులు సన్మానించారు.ఈ సందర్భంగా బాలభద్రుని వేదాశ్రీకి మొదటి ప్రోత్సాహక బహుమతిగా రూ.15,000 నగదు అందజేశారు. అలాగే కోసనాల వైశాలికి ద్వితీయ బహుమతిగా రూ.10,000 నగదు పురస్కారం అందించారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమితి ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు సమితి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు విజయరావు నరసింహరావు, ఈవీఎల్ వెంకటేశ్వర్లు, సూర్య గోవింద్, బండి రాజా రమేష్, తాడి బాలకృష్ణ, కాళంగి వెంకటేశ్వర్లు, తాడి వెంకటేశ్వర్లు, బండి చిన్న తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో ఘనంగా శ్రీకాంత్ తనయుడి జన్మదిన వేడుకలు

**పొదిలి, పెన్ పవర్, జూన్ 15**

జిల్లా ఐటీడీపీ అధ్యక్షులు గిద్దలూరు శ్రీకాంత్ తనయుడు హన్స్ జన్మదిన వేడుకలు సోమవారం నాడు పొదిలిలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ పాల్గొని తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఐకాన్ వరికుంట్ల నిరంజన్, పలువురు నాయకులు, ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి 'పోలీస్ మీకోసం'

## -కందుకూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ

## -34 ఫిర్యాదుల స్వీకరణ.. సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

## ప్రజా సమస్యల పరిష్కారమే పోలీస్ శాఖ లక్ష్యం -ఎస్పీ హర్షవర్ధన్ రాజు







**కందుకూరు పెన్ పవర్ జూన్15**

ప్రజలకు న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం.. వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుంది" అని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్ విధానంలో భాగంగా ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'పోలీస్ మీకోసం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సోమవారం కందుకూరు డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కందుకూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, మొత్తం 34 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యల పూర్తి వివరాలను తెలుసుకొని చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, వాటిపై చేపట్టిన చర్యల నివేదికలను కూడా సమర్పించాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, దూర ప్రాంతాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా సబ్ డివిజన్ స్థాయిలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి సోమవారం ప్రత్యామ్నాయ పద్ధతిలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని సబ్ డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక 'మీకోసం' కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎస్పీ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర విచారణ అనంతరం చట్టపరిధిలో న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, చీటింగ్ కేసులు, భర్త లేదా అత్తింటి వేధింపులు, భూ ఆస్తి వివాదాలు సహా పలు సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అందినట్లు సమాచారం.అదేవిధంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీధర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, కందుకూరు సీఐ అన్వర్ బాషా, గుడ్లూరు సీఐ నరేష్ కుమార్, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరిరావు, దర్శి సీఐ రామారావు, కొండేపి సీఐ రమణయ్య, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి



**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 15**

వర్జీనియా పొగాకు అమ్మకాలు ప్రారంభమై ఇప్పటికి 60 రోజులు దాటిందని నేటికీ 10 శాతం పొగాకు మాత్రమే కొనుగోలు చేశారని మిగిలిన పొగాకు అమ్మకానికి ఇంకెన్ని నెలలు పడుతుందో అర్థం కావడం లేదని జిల్లా సిపిఎం పార్టీ సభ్యులు కేజీ మస్తాన్ అన్నారు . స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో సోమవారం పొగాకు రైతులకు పొగాకు కొనుగోలుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 1000 కోట్ల కేటాయించాలని కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళన బాట చేపట్టారని తెలిపారు. రైతులు పట్ల ఈ ప్రభుత్వాలకు ఎంత శ్రద్ధ ఉన్నదో అర్థమవుతుందని అన్నారు. ఈనెల 19వ తేదీ ఒంగోలులో పొగాకు రైతులు గిట్టుబాటు ధర కోసం ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నారని పొగాకు రైతులు ఈ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పల్లపోతు సురేంద్ర, తాటి యలమంద తదితరులు పాల్గొన్నారు.


# అంగన్వాడి పిలుస్తోంది.. చిన్నారుల భవిష్యత్‌కు బాటలు



**పుల్లల చెరువు పెన్ పవర్ జూన్ 15**

మండలంలోని ముటుకుల గ్రామంలో అంగన్వాడి కేంద్రం ఆధ్వర్యంలో 'అంగన్వాడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్త మల్లీశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ దేవీబాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి కీలక భూమిక పోషిస్తున్నాయని అన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రతి చిన్నారిని అంగన్వాడి కేంద్రాల్లో నమోదు చేయించి, వారి సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# బిఎల్ఏల నియమకాపత్రాలను అందజేసిన పాశం రామకృష్ణ



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐర్) కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ తరపున నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ 2) నియామక పత్రాలను మండల పార్టీ అధ్యక్షులు పాశం రామకృష్ణ చేతుల మీదుగా సోమవారం బిఎల్ఏ 1 బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నరాల శ్రీనివాసులు రెడ్డికి అందజేశారు ఈ సందర్భంగా నరాల శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు కావడంతో పాటు, తప్పులు, లోపాలు సరిదిద్దే విషయంలో బీఎల్ఏలు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కో కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య, జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం, జిల్లా బిజెపి కార్యదర్శి వద్దిపాటి వెంకటేష్, జిల్లా ఆర్డిఐ కన్వీనర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై గా పిచ్చాల వెంకటేశ్వర రెడ్డి బాధ్యతల స్వీకరణ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా పిచ్చాల వెంకటేశ్వర రెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు సి ఎస్ పురం ఎస్ఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వరనాయక్ ను వి ఆర్ కు బదిలీ చేశారు.




# స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని అమలు చేయాలి - కలెక్టర్ పి.రాజాబాబు



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

జిల్లాలో ' స్టాప్ డయేరియా ' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. దీనికి సంబంధించిన పోస్టరును సోమవారం మీకోసం కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలు ఎవరూ డయేరియాతో మరణించకూడదని, లైన్ డిపార్ట్మెంట్ సమిష్టిగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ముఖ్యముగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు యందు పిల్లల్కు ప్రజలకు వ్యక్తిగత పరిశ్రుభ్రత, చేతులు పరిశ్రుభ్రముగా ఉంచుకొను విధానము ప్రజలకు డెమో చేసి తెలియజేయాలని అన్నారు. ఓ ఆర్ ఎస్ ద్రవం తయారు చేసే విధానాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి టి వెంకటేశ్వర్లు, డాక్టర్ కమలశ్రీ జిల్లా వ్యాధి నివారణ టీకాల అధికారి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలోని అందరు లైన్ డిపార్ట్మెంట్ అధికారులకు స్టాప్ డయేరియా ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. పరిశుభ్రతతో 'స్టాప్ డయేరియా'! పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపే వ్యాధి అని అజాగ్రత్తగా ఉంటే మూత్రపిండాలకు ప్రమాదం అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి తెలిపారు. జూన్ 16 నుంచి జులై 30 వరకు నివారణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వర్షాకాలం మొదలైనందున డయేరియా ముప్పు పొంచి ఉంటుందని, ప్రధానంగా కలుషిత నీరు, కలుషిత ఆహారము తీసుకోవడం వల్ల అతిసారం ప్రబలే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ వ్యాధి పిల్లలపై మరింత ప్రభావం చూపుతుందని, దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు సోమవారం నుంచి ప్రజారోగ్య విభాగం 'స్టాప్ డయేరియా' కార్యక్రమాన్ని ప్రారంభిస్తోందని, జులై చివరి వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలున్న ఇళ్లలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు రెండేసి చొప్పున ఓఆర్ఎస్ ప్యాకె ట్లను అందజేస్తారని పేర్కొన్నారు. అన్ని ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయాలని, అంగన్వాడీ కేంద్రాలు , పాఠశాలల్లో వ్యక్తిగత పరిశుభ్రత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని టీచర్లు పిల్లలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# ప్రవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ కు ప్రభుత్వం ప్రోత్సాహించాలి

## - రాష్ట్ర అధ్యక్షుడు డివి సత్యనారాయణ



**కందుకూరు పెన్ పవర్, జూన్ 15**

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సమావేశం సోమవారం యూనియన్ నాయకులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షులు డి వి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రావ్యాప్తశీగా ప్రవేట్ ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమగ్ర సర్వే యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కందుకూరు ప్రాంతానికి రావడం జరిగిందని అన్నారు.రాష్ట్ర యూనియన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. ప్రవేట్ వర్కర్లుగా ఎందరో యువత పనిచేస్తున్నారని. వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం అందడం లేదని అన్నారు. ప్రభుత్వం స్కిల్డ్ వర్కర్స్ జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా చేతి పనిమీద ఆధారపడి చాలీ చాలని సంపాదనతో జీవనం సాగిస్తున్నారని వారందరికీ నివేసన స్థలాలు ఇవ్వాలని కోరారు.కార్యక్రమం లో కందుకూరు మండల ప్రకాశం మోటర్ రివైండింగ్ అధ్యక్ష కార్యదర్సులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# 'సుఖీభవ 5కే రన్'తో ఆరోగ్యం వ్యాయామం

## - న్యూట్రిషన్ తోనే సంపూర్ణ ఆరోగ్యం




**పెన్ పవర్, సంతమాగులూరు,జూన్ 15**

ఆరోగ్యకరమైన జీవనశైలికి వ్యాయామం, సమతుల పోషకాహారం రెండూ సమానంగా అవసరమని శ్రీ శివ హనుమాన్ న్యూట్రిషన్ సెంటర్ అధినేత కే. సుధాకర్ రావు అన్నారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించే లక్ష్యంతో ఆయన ఆధ్వర్యంలో 'సుఖీభవ 5కే రన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామం నుంచి పుట్టవారిపాలెం జంక్షన్ వరకు జరిగిన ఈ ఐదు కిలోమీటర్ల పరుగులో యువత, మహిళలు, ఆరోగ్యాభిలాషులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**మారుతున్న జీవనశైలి.. పెరుగుతున్న ఆరోగ్య సమస్యలు**

ఈ సందర్భంగా సుధాకర్ రావు మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని అన్నారు. కేవలం ఆహారం తీసుకోవడం లేదా కేవలం వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదని, శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా సమతుల ఆహారం తీసుకుంటూనే నిత్య వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. రోజుకు కనీసం 30 నుంచి 45 నిమిషాల పాటు నడక, పరుగు, యోగా వంటి వ్యాయామాలు చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు.

**ఫిట్‌నెస్‌కు న్యూట్రిషన్ తోడైతేనే ఫలితం**

వ్యాయామం శరీరంలో రక్తప్రసరణను పెంచి రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తే, పోషకాహారం శరీరానికి అవసరమైన శక్తి, బలాన్ని అందిస్తుందని వివరించారు. చిన్న వయసు నుంచే పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. 'సుఖీభవ 5కే రన్' ద్వారా ఆరోగ్యంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొని విజయవంతం చేశారు.


# పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన ఎంఈఓ 2



**దొనకొండ జూన్ 15 పెన్ పవర్ :**

దొనకొండ మండలంలోని పోలేపల్లి గ్రామం నందు సోమవారం మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యాశాఖ అధికారి-2 వి.వి రామాంజనేయులు పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి తగు సూచనలు తెలియజేసి, అనంతరం పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు కొరకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిమూల ప్రభుదాసు మరియు పి పావని విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న సన్నిధిలో బోయళ్ల నారాయణరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొని మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా బోయళ్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రం భారతదేశంలోని అత్యంత పవిత్రమైన శైవ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిందన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన మల్లికార్జున స్వామి, అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన భ్రమరాంబ అమ్మవారి ఆలయాలు ఒకే ప్రాంతంలో ఉండటం ఈ క్షేత్రానికి విశిష్టతను తెచ్చిపెట్టిందని పేర్కొన్నారు.ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. ప్రకృతి ఒడిలో విరాజిల్లుతున్న నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీశైలం క్షేత్రం భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ప్రకృతి సౌందర్యాన్ని కూడా అందిస్తోందని చెప్పారు. మల్లన్న ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచిత సైకిళ్ల పంపిణీ

## – పీఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం





**పెన్ పవర్, బల్లికురవ/సంతమాగులూరు, జూన్ 15,**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సోమవారం అద్దంకి నియోజకవర్గంలో పర్యటించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. కొప్పెరపాలెంలో 111 మంది, మల్లాయపాలెంలో 43 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. అనంతరం మల్లాయపాలెం కాలనీలో పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా బోధనలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ముందుకు సాగాలని అన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. మెరుగైన విద్యా వ్యవస్థ కోసం మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని చెప్పారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 11,500 మందికిపైగా విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేసినట్లు వెల్లడించారు. దాతల సహకారంతోనే పేద, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని పేర్కొన్నారు. అలాగే 200 మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై స్కూటీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యుత్ రంగ అభివృద్ధిపై మాట్లాడుతూ ఆర్డీఎస్ఎస్ పథకం కింద మల్లాయపాలెంలో 290 కొత్త విద్యుత్ స్తంభాలతో పాటు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ముందుకొచ్చే ప్రతి అర్హ కుటుంబానికి సోలార్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామని, ఓసీ, బీసీ వర్గాల వినియోగదారులు కూడా ఈ పథకం ద్వారా రాయితీలతో సోలార్ కనెక్షన్లు పొందవచ్చని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని, ప్రభుత్వ విజయాలను చూసి ఓర్వలేక వైఎస్సార్‌సీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పిలుపునిచ్చారు.

# 17 న రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ పర్యటన

## – బీసీల వెనుకబాటుతనం పై పరిశీలనకు సింగరాయకొండ రాక

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల (బిసీ) పౌరుల వెనుకబాటుతనం పై అనుభవపూర్వక పరిశోధన, రిజర్వేషన్ల శాతం ఖరారు కొరకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నియమించబడిన ప్రత్యేక కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా, ఈనెల 17న (బుధవారం) సాయంత్రం 4.00 నుండి 5.00 గంటల వరకు సింగరాయకొండ ఎంపీడీవో కార్యాలయంలో యందు అధికారిక పర్యటన చేపట్టనున్నారని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారితాధికారి యస్.నిర్మల జ్యోతి ఒక ప్రకటనలో తెలియజేశారు. స్థానిక సంస్థలలో బీసీల వెనుకబాటుతనంపై సంబంధిత అధికారులతో సమీక్ష, అలాగే బీసీ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, ఆసక్తి గల సాధారణ ప్రజల నుండి వినతి పత్రాలు, మెమోరాండాల స్వీకరణ ఈ పర్యటనలో భాగంగా కమిషన్ సభ్యులు బీసీ కులాల ప్రతినిధులతో నేరుగా ముఖాముఖి నిర్వహించనున్నారు. ఆసక్తి గల వ్యక్తులు, సంఘాలు తమ తమ వినతులను, సూచనలను లిఖితపూర్వకంగా లేదా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ (పెన్ డ్రైవ్/సిడి) రూపంలో సమర్పించవచ్చు అని తెలిపారు. ప్రకాశం జిల్లాలోని బీసీ కుల సంఘాల ప్రతినిధులు, సివిల్ సొసైటీ సంస్థలు, ప్రజాప్రతినిధులు, వెనుకబడిన తరగతుల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత సమయానికి ఎంపిడిఓ కార్యాలయం వద్దకు విచ్చేసి తమ అమూల్యమైన వినతులను కమిషన్ కు సమర్పించాల్సిందిగా యస్.నిర్మల జ్యోతి కోరారు.

# ఎన్డీఏ కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

## మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పిలుపు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 15**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కనిగిరి అమరావతి గ్రౌండ్లో నిర్వహించనున్న విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన ఈ విజయోత్సవ సభ జరగనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే ఉద్దేశంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.మండలంలోని 23 గ్రామపంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, బూత్ కన్వీనర్లు, టిడిపి సీనియర్ నాయకులు, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

# రెండేళ్ల కూటమి పాలన ప్రజల మన్నన పొందింది

## టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జూన్ 15**

రెండేళ్ల కూటమి పాలన ప్రజల మన్నన పొందిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు. సోమవారం జరిగిన సుపరిపాలన విజయోత్సవ కార్యక్రమంలో అయన పాల్గొని ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన దిశగా ముందుకు నడిపిస్తూ నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబు నాయుడు విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న రని అన్నారు.గత ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందలేదని. గ్రామాల అభివృద్ధి కుదేలు అయ్యిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరిచి అంతకు మించి రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించేందుకు ఎన్నో నూతన పథకాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. రెండేళ్ల పాలనలో ఆర్థిక సమస్య అడ్డుగా ఉన్న రాష్ట్రంలో సంక్షేమపథకాలు, మౌలిక వసతుల కల్పన, విద్యా, వైద్యం, మహిళ సాధికారత, ప్రభుత్వం సాధించిన ప్రగతని అన్నారు. నేడు రాష్ట్రంలో ప్రజలు కూటమి పాలనకు మద్దతుగా నిలిచారాని చంద్రన్న అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తుముల ఎల్లారెడ్డి



**కొమరోలు పెన్ పవర్ జూన్ 15**

కొమరోలు మండలం సూరవారిపల్లి పంచాయతీలోని బెడుసుపల్లి, బొడ్డువానిపల్లి తదితర గ్రామాలలో సోమవారం ప్రారంభమైన ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముత్తుముల ఎల్లారెడ్డి పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో బి బాలిరెడ్డి, సిహెచ్ దివాకర్ ,పి గురువయ్య తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

**పద్మనాభం, జూన్ 15, పెన్ పవర్ జూన్ 15**

భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పద్మనాభం మండలం పొట్నూరు గ్రామానికి చెందిన జనా జగదీష్‌కు రూ.64,000 విలువైన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ రమణ, క్లస్టర్-1 ఇన్‌చార్జి మజ్జి నందీశ్వరరావు, బాందేపురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్‌కేఎంఎస్ రాజు, రెడ్డిపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ కారేపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి అధికారం కోల్పోయిన నాయకుల ధోరణి మారలేదు

## బీజేపీ నేత డా. ఏలూరి రామచంద్రారెడ్డి

**మార్కాపురం పెన్ పవర్ జూన్ 15**

అధికారం కోల్పోయి కేవలం 11 అసెంబ్లీ సీట్లకే పరిమితమైనప్పటికీ వైసీపీ నాయకుల అహంకారం, వెటకార ధోరణి ఏమాత్రం తగ్గలేదని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి విమర్శించారు. వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురించి చేసిన వ్యాఖ్యలు ఆయన రాజకీయ అవగాహన లేమికి, సంస్కారహీనత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రజా జీవితంలో విశేష సేవలందిస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు పీవీఎన్ మాధవ్ ఎవరికి తెలియదని మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఒక జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి గురించి కనీస అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయడం వైసీపీ నేతల రాజకీయ దివాళాకోరుతనాన్ని బయటపెడుతోందని విమర్శించారు. మాధవ్ గతంలో ఎమ్మెల్సీగా పని చేసిన సమయంలో శాసన మండలి లో అనేక ప్రజా సమస్యల గురించి సమగ్రంగా చర్చించి ప్రజల ప్రశంసలు పొందిన గొప్ప వ్యక్తి అని ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని డా. ఏలూరి తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వే విస్తరణ, పారిశ్రామిక ప్రగతి వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో సహకారం అందిస్తూ రాష్ట్ర పురోగతికి బాటలు వేస్తోందని చెప్పారు.



# ‘పిల్ ‘ పితామహుడు జస్టిస్ భగవతి




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

ప్రజాహిత వ్యాజ్యం (పిల్) రూపకర్తగా జస్టిస్ పిఎన్. భగవతి భారత న్యాయవ్యవస్థ చరిత్రలో అత్యంత ప్రభావశీలులైన న్యాయమూర్తులలో ఒకరుగా నిలిచిపోయారని హైకోర్టు న్యాయవాది షేక్ కరిముల్లా పేర్కొన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలులో జస్టిస్ పిఎన్. భగవతి వర్ధంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ కరిముల్లా మాట్లాడుతూ ప్రజా హిత వ్యాజ్యం అభివృద్ధికి చేసిన కృషి కారణంగా ఆయనను “పిల్ పితామహుడు” అని పిలుస్తారని భారత సుప్రీంకోర్టు 17వ ప్రధాన న్యాయమూర్తిగా న్యాయవ్యవస్థ క్రియాశీలంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని వివిధ తీర్పుల ద్వారా ఆయన చాటి చెప్పారని అన్నారు. భారతదేశంలో ‘ ప్రజాహిత వ్యాజ్యం’ విధానాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి పేదలు, ఖైదీలు, కార్మికులు, మహిళలు మరియు అణగారిన వర్గాలకు సమాన న్యాయం అందేలా న్యాయవ్యవస్థను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు)ను విస్తృతంగా వ్యాఖ్యానించి, గౌరవప్రదమైన జీవితం, న్యాయ సహాయం, వేగవంతమైన విచారణ వంటి హక్కులను దాని పరిధిలోకి చేర్చడంలో కీలక పాత్ర పోషించారని, జస్టిస్ భగవతిని ప్రజలందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు కే. శేషాద్రి, ఎమ్. నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ విజయవంతం

## – 119 అర్జీల రాక – అర్జీల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశం



**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు జూన్ 15**

ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డీ.ఆర్.వో. మాధురి, ఆర్.డీ.వో. చంద్ర శేఖర్ నాయుడు, డీ.పీ.వో. వెంకటేశ్వరరావులతో కలిసి ఆయా వర్గాల ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ ప్రజలు కోరిన నేపథ్యంలో ప్రతి నెలా మూడో సోమవారం వీరికోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ప్రస్తుతం వచ్చిన 119 అర్జీలపై ఎస్సీ, ఎస్టీ శాఖల అధికారులు మరింత దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కందులూరు గ్రామంలో దుస్తులు, పుస్తకాల పంపిణీ



**టంగుటూరు జరుగుమల్లి జూన్ 15 పెన్ పవర్**

టంగుటూరు మండలంలోని కందులూరు లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి విద్యా మిత్ర కిట్ లో భాగంగా టెక్స్ట్ పుస్తకాలు, నోట్స్ లు, దుస్తులను స్థానిక గ్రామస్థులు దామచర్ల బసవయ్య మరియు మన్నం వెంకయ్య అందించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్ద దామచర్ల బసవయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం చాలా ఖర్చు పెడుతుందని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కలిగిస్తుందని వాటిని వినియోగించుకొని చక్కగా విద్యను అభ్యసించి గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. మన్నం వెంకయ్య మాట్లాడుతూ పాఠశాల ఉన్నత పాఠశాలగా రూపుదిద్దుకున్న సందర్భంగా విద్యార్థులను తీర్చిదిద్దడం లో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని గ్రామంలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని గ్రామస్తులంతా కూడా బడి ఈడు గల బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు, ఎస్ఎంసి చైర్మన్ కె.వి రజిని మరియు పాఠశాల ఉపాధ్యాయులు పి కృష్ణారెడ్డి, సిహెచ్ శ్రావణ్ కుమార్, పి రవిశంకర్, కె .భాస్కర్ టి .పద్మావతి వి. విజయలక్ష్మి, బి.సుభాషిని, డి.మాధవి సుందరి తదితరులు పాల్గొన్నారు.

# విరాట్ కోహ్లీ నిజంగానే అహంకారి.. రవి శాస్త్రి కామెంట్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మైదానంలో అడుగుపెడితే ఎలా ఉంటాడో క్రికెట్ ప్రేమికులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. ఒక్కసారి గ్రౌండ్‌లోకి దిగిన తర్వాత కోహ్లీ బాడీ లాంగ్వేజ్ పూర్తిగా చేంజ్ అవుతుంది. ప్రత్యర్థి జట్టు కవ్వింపు చర్యలకు దిగితే వారి శైలిలోనే ఆన్సర్ ఇస్తాడు.. స్లెడ్జింగ్‌కు దిగిన వారికి దిమ్మతిరిగేలా కౌంటర్ ఇస్తాడు. అదే సమయంలో అంతే సరదాగానూ ఉండటం కోహ్లీకే చెల్లింది. కానీ, కొంతమంది మాత్రం విరాట్ కోహ్లీని అహంకారి, కోపిష్టి అంటూ విమర్శిస్తూ ఉంటారు. తాజాగా ఇదే తరహాలో కోహ్లీని విమర్శిస్తూ టీమిండియా మాజీ కోచ్ ఓ పోస్టు పెట్టారు.

**నిజంగానే కోహ్లీ అహంకారి:**

విరాట్ కోహ్లీని విమర్శిస్తూ వచ్చిన పోస్టుపై టీమిండియా మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి మాట్లాడుతూ.. అహంకారి, అతి గారాబం వల్ల చెడిపోయిన అల్లరిపిల్లాడు.. దూకుడు.. కోహ్లీ గురించి వాళ్లు అన్న ప్రతీ మాటలో నిజం ఉందన్నాడు. కానీ, ఇదంతా క్రికెట్ స్టేడియంలో ఉన్నంత వరకే. గ్రౌండ్ బయట విరాట్ ఇందుకు పూర్తి విభిన్నంగా ఉంటాడని వెల్లడించాడు. ఎక్కడ ఎలా ఉండాలో తెలిసిన వ్యక్తులంటే నాకు చాలా ఇష్టం.. స్టేడియంలో కింగ్ కోహ్లీ చూపించే అగ్రెషన్ క్రీడలో భాగమేనని శాస్త్రి పేర్కొన్నారు.

**కోహ్లీ- రవిశాస్త్రి మధ్య ప్రత్యేక అనుబంధం:**

రవిశాస్త్రి హెడ్‌కోచ్‌గా, కోహ్లీ కెప్టెన్‌గా ఉన్న సమయంలో భారత జట్టు అద్భుతమైన విజయాలు సాధించింది. ముఖ్యంగా టెస్టు ఫార్మాట్‌లో నంబర్ వన్‌గా నిలిచి సత్తా చాటింది. ఆ తర్వాత ఈ ఇద్దరు తమ తమ పదవుల నుంచి తప్పుకున్నప్పటికీ, వారి మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే కొనసాగుతోంది. తాజాగా రవిశాస్త్రి చేసిన కామెంట్స్ తో ఈ విషయం మరోసారి రూజువైంది.

**వన్డే సిరీస్‌కు కింగ్ కోహ్లీ దూరం:**

ఇటీవలే ముగిసిన ఐపీఎల్-2026 లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) విజేతగా నిలవడంలో విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషించాడు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన కోహ్లీ.. ఆఫ్ఘనిస్తాన్‌తో స్వదేశంలో జరుగుతున్న వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని స్థానంలో యశస్వి జైస్వాల్ జట్టులోకి వచ్చాడు. మరోవైపు రవిశాస్త్రి ప్రస్తుతం కామెంటేటర్‌గా కొనసాన్నాడు.

# జూన్ 17న ఉదయం మ్యాచ్.. మధ్యాహ్నం మ్యాచ్.. రాత్రికి మరో మ్యాచ్.. భారత క్రికెట్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ అభిమానులకు ఎల్లుండి (జూన్ 17న) పండగలాంటి రోజు అని చెప్పాలి.. ఎందుకంటే ఆ ఒక్క రోజే ఏకంగా మూడు క్రేజీ మ్యాచ్‌లు జరగబోతున్నాయి. ఉదయం నుంచి రాత్రి దాకా టీమిండియాకు సంబంధించిన వేర్వేరు జట్లు మైదానంలోకి దిగుతుండటంతో.. ఏకంగా 12 గంటల పాటు నాన్‌స్టాప్ క్రికెట్ ఎంటర్‌టైన్‌మెంట్ పక్కా అని ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.

**ఇండియా A' vs ఆఫ్ఘనిస్తాన్ 'A':**

ట్రై సిరీస్‌లో భాగంగా ఎల్లుండి ఉదయం 10:00 గంటలకే మొదటి మ్యాచ్ స్టార్ట్ అవుతుంది. ఇండియా 'ూ', ఆఫ్ఘనిస్తాన్ 'ూ' జట్ల మధ్య వన్డే (ాణ×) పోరు జరగబోతుంది. యంగ్ ప్లేయర్స్ తమ సత్తా చాటడానికి ఈ మ్యాచ్ ఎంతో కీలకం కానుంది.

**టీమిండియా VS ఆఫ్ఘనిస్తాన్:**

ఇక మధ్యాహ్నం నుంచి అసలైన హై-వోల్టేజ్ మ్యాచ్ ప్రారంభమైతుంది. మధ్యాహ్నం 1:30 గంటలకు ఆఫ్ఘనిస్తాన్ సీనియర్ జట్టుతో టీమిండియా తన రెండవ వన్డే (2అస ాణ×) మ్యాచ్‌లో తలపడనుంది. సీనియర్ల పోరు కావడంతో ఈ మ్యాచ్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

**భారత మహిళల జట్టు జం నెదర్లాండ్స్:**

పగలు మెన్స్ క్రికెట్ ముగిశాక, రాత్రి సమయంలో ఉమెన్స్ క్రికెట్ ధమాకా షురూ కాబోతుంది. మహిళల టి20 వరల్డ్ కప్ (ు20 ఔజ) లో భాగంగా రాత్రి 7:00 గంటలకు భారత మహిళల జట్టు నెదర్లాండ్స్‌ను ఢీకొట్టనుంది. వరల్డ్ కప్ పోరు కావడంతో మన అమ్మాయిల మ్యాచ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

దీంతో బుధవారం నాడు పొద్దున్న 10 గంటల నుంచి రాత్రి దాకా టీవీలు, మొబైల్ స్క్రీన్లకు అతుక్కుపోయేలా మొత్తం 12 గంటల నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ రెడీ అయింది. దీంతో ఆ రోజు అన్ని మ్యాచులని చూసేందుకు క్రికెట్ ఫ్యాన్స్ రెడీ అవుతున్నారు. మరీ చూడాలి జూన్ 17న భారత్ జట్టు అన్ని విభాగాల్లో గెలుస్తుందో లేదో అనేది.

# ఐపీఎల్‌లో ఊచకోత.. శ్రీలంకలో చేతులెత్తేసిన వైభవ్.. ఫ్లాట్ పిచ్ కాదురా బాటు అంటూ ట్రోలింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** : ఐపీఎల్ (IPL 2026) లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న 15 ఏళ్ల వండర్ కిడ్ 'ఆరెంజ్ క్యాప్' గెలుచుకుని, క్రిస్ గేల్ పేరిట ఉన్న మోస్ట్ సిక్సర్స్ (72 సిక్సులు) రికార్డును బద్దలు కొట్టిన వైభవ్ సూర్యవంశీ.. ప్రస్తుతం శ్రీలంక వేదికగా జరుగుతున్న వన్డే ట్రై-సిరీస్‌లో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నాడు. టీమిండియా 'A' తరఫున ఆడుతున్న ఈ యంగ్ ఓపెనర్.. వరుసగా 3 ఇన్నింగ్స్‌ల్లోనూ తక్కువ స్కోర్లకే అవుట్ కావడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు అతడిపై గట్టిగానే ట్రోలింగ్ నడుస్తుంది.

**వన్డేల్లో తడబడిన వైభవ్:**

తిలక్ వర్మ కెప్టెన్సీలోని భారత్ 'ూ' జట్టు ఈరోజు (సోమవారం) రంగిరి దంబుల్లా అంతర్జాతీయ స్టేడియంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ సూర్యవంశీ.. చమిక గుణశేఖర వేసిన తొలి ఓవర్లోనే ఒక సిక్స్, రెండు ఫోర్లు బాది ఐపీఎల్ రేంజ్ అటాకింగ్ స్టార్ట్ చేశాడు. కానీ, శ్రీలంక 'ూ' కెప్టెన్, ఆఫ్-స్పిన్నర్ సహన్ అరాచ్చిగే బౌలింగ్‌లోకి రాగానే వైభవ్ తడబడ్డాడు. కేవలం 14 బంతుల్లో 21 పరుగులు (3 ఫోర్లు, 1 సిక్స్) చేసి ఔట్ అయ్యాడు.

**మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ ఫ్లాప్ షో:**

ఐపీఎల్‌లో 237.3 స్ట్రైక్ రేట్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ, ఈ వన్డే సిరీస్‌లో క్రీజులో అస్సలు నిలబడలేకపోతున్నాడు. శ్రీలంక 'ూ'తో జరిగిన మొదటి మ్యాచ్లో 12 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేయగా.. ఇక ఆఫ్ఘనిస్తాన్ 'ూ'తో జరిగిన పోరులో 22 బంతుల్లో 44 రన్స్ తో మంచి స్టార్ట్ వచ్చినప్పటికీ, దాన్ని భారీ స్కోరుగా మార్చుకోలేకపోయాడు. అలాగే మూడో మ్యాచ్ : 14 బంతుల్లో 21 రన్స్ మాత్రమే చేసి తన ఫ్లాప్ షోని కంటిన్యూ చేశాడు.

**సోషల్ మీడియాలో ట్రోల్స్:**

వైభవ్ వరుసగా విఫలం అవుతుండటంతో.. ఈ నెల చివర్లో జరగబోయే ఐర్లాండ్ సిరీస్‌కు, అలాగే జూలైలో ఇంగ్లాండ్ సిరీస్‌కు టీమిండియా మెయిన్ టీమ్‌కు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా రికార్డ్ సృష్టించిన వైభవ్‌ను నెటిజన్లు టార్గెట్ చేస్తున్నారు. బాబోయ్.. ఇది ఐపీఎల్ ఫ్లాట్ పిచ్ కాదురా బాబు.. ఇంటర్నేషనల్ కండిషన్స్‌లో స్పిన్నర్లను ఎలా ఆడాలో నేర్చుకో, పవర్‌ప్లే ముగియకముందే ఔట్ అవ్వడానికి ఇది టీ20 కాదు, వన్డే మ్యాచ్.. కొంచెం నిలకడగా ఆడాలి అంటూ ఎక్స్ (X) లో ట్రోల్ చేస్తున్నారు.

**కోచ్ ఫుల్ సపోర్ట్:**

నెట్టింట ట్రోలింగ్ ఎలా ఉన్నా.. ఇండియా 'A' హెడ్ కోచ్ హృషికేష్ కణిత్కర్ మాత్రం వైభవ్‌కు అండగా నిలిచాడు. వైభవ్ చాలా చిన్న వయస్కుడైనప్పటికీ, తన బ్యాటింగ్, జట్టులో తన రోల్ ఏంటనేది అతనికి బాగా తెలుసు.. ఎవరైనా సలహాలు ఇస్తే వింటాడు, దానిని ప్రాక్టీస్ చేస్తాడు.. అతని బ్యాటింగ్ తీరు నాకు బాగా నచ్చిందంటూ కోచ్ పాజిటివ్‌గా స్పందించాడు.

మానస చౌదరి సంప్రదాయ శోభ: అరంగేట్రం నుండి వర్ధమాన తారగా...



# రష్మిక మందన్న మొదటి A-రేటెడ్ ఫిలిమ్



శ్రేయా ధన్వంతరి యొక్క బోల్డ్ గ్లో: తెలుగు అరంగేట్రం నుండి ఆ స్టార్ వరకు



నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో మొదటిసారి ఒక ఘాటైన రొమాంటిక్ -ఏ- రేటెడ్ సినిమాలో నటించారు. బాలీవుడ్ నటులు షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన -కాక్‌టెయిల్ 2- చిత్రానికి సెన్సార్ బోర్డ్ (జదీఖీజ) తాజాగా ాూ సర్టిఫికేట్ జారీ చేసింది. సాధారణంగా రష్మిక ఇప్పటివరకు నటించిన సినిమాలన్నీ ఖ లేదా యుఏ సర్టిఫికేట్‌లతోనే వచ్చాయి. గతంలో -యానిమల్- చిత్రానికి -ఏ- సర్టిఫికేట్ వచ్చినా.. అది భారీ రక్తపాతం, వయలెంట్ యాక్షన్ వల్ల వచ్చింది. కానీ ఇప్పుడు రానున్న -కాక్‌టెయిల్ 2- మాత్రం పూర్తిగా ఘాటైన శృంగార సన్నివేశాలు, రొమాంటిక్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో నిండి ఉండటం వల్లే వయోజనులకు మాత్రమే (అడల్ట్స్ ఓన్లీ) అని సెన్సార్ బోర్డు తేల్చేసింది. ఈ శుక్రవారం -జూన్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే కొన్ని పరిమిత స్క్రీన్లలో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రానికి -ఏ- సర్టిఫికేట్ లభించిన విషయం వెలుగులోకి వచ్చింది. రష్మికతో పాటు గ్లామరస్ బ్యూటీ కృతి సనన్‌కు కూడా ఇది కెరీర్‌లో మొదటి అడల్ట్ ఫిల్మ్ కావడం గమనార్హం. ఈ చిత్రంలో కృతి సనన్ మునుపెన్నడూ చూడని బోల్డ్ - గ్లామ్ లుక్‌లో కనిపించనున్నారు. -తేరే ఇష్క్ మే- చిత్రంలో ఎంతో ఇంటెన్స్ రోల్ పోషించిన కృతి.. ఇందులో ఇలాంటి పూర్తి బోల్డ్ అవతారంలోకి మారడం చూసి అభిమానులు సైతం షాక్‌కు గురవుతున్నారు. గతంలో 2012లో వచ్చిన -కాక్‌టెయిల్- చిత్రం సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకోన్, డయానా పెంటిల మధ్య నడిచే ముక్కోణపు ప్రేమకథగా వచ్చి బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. ముఖ్యంగా ఆ సినిమా దీపికా పదుకోన్ కెరీర్‌ను మలుపు తిప్పింది. అయితే ఆ మొదటి భాగం సెకండ్ హాఫ్‌లో కాస్త మెలోడ్రామాగా మారినా... ఈ సరికొత్త సీక్వెల్ మాత్రం మొదటి నుండి చివరి వరకు చాలా కూల్‌గా, హాయిగా సాగిపోతుందని నిర్మాత దినేష్ విజన్ ట్రైలర్ లాంచ్‌లో వెల్లడించారు. అయినా థియేటర్లలో యూత్‌ను ఆకట్టుకునేలా ఇందులో బోల్డ్ సీన్స్ మోతాదు కాస్త గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా ట్రైలర్ - కథనం చూస్తే.. 2012 నాటి మొదటి భాగం టెంప్లేట్‌నే మేకర్స్ ఫాలో అయినట్లు స్పష్టమవుతోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ విపరీతమైన స్టైల్, అందమైన సముద్ర తీరాలు, హాట్‌నెస్ - సెక్సీనెస్ కవ్విస్తూనే ఉన్నాయి. అయితే ఈ ప్రోమో కేవలం గ్లామర్‌ను నమ్ముకుని కాస్త డొల్లగా ఉందనే విమర్శలు కూడా వస్తున్నాయి. సినిమాలో ఏదైనా బలమైన కంటెంట్ ఉందా లేదా అనేది కేవలం ట్రైలర్ చూసి ఇప్పుడే అంచనా వేయలేం. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉందని... ఇది ఒక క్వీర్ -స్వలింగ ప్రేమకథ అనే పుకార్లు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. దీనిపై క్లారిటీ రావాలంటే జూన్ 19 వరకు ఆగాల్సిందే. మొదటి భాగం -కాక్‌టెయిల్- అంతటి భారీ బ్లాక్‌బస్టర్ కావడానికి సంగీత దర్శకుడు ప్రీతమ్ అందించిన అద్భుతమైన పాటలు ఒక ముఖ్య కారణం. కానీ ఈ సీక్వెల్ చిత్రానికి సంబంధించిన ప్రోమో - సౌండ్‌ట్రాక్ మొదటి భాగం అంత ఆకట్టుకునేలా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా.. షాహిద్ కపూర్‌తో పాటు కృతి సనన్, రష్మిక మందన్నల బోల్డ్ అండ్ రొమాంటిక్ కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మరి ఈ ఘాటైన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com